RNI: APTEL/2013/54506

# నేటి ప్రస్థానం

తెలుగు దినపత్రిక




| హైదరాబాద్ | బుధవారం 9-9-2026 | సంచిక: 13 | సంఖ్య: 342 పేజీలు: 8 | వెల: 5/- | ఎడిటర్: సందీప్ గౌడ్ వి |
|---|---|---|---|---|---|



# శాసన మండలిలో బీఆర్ఎస్‌కు షాక్..

## తాతా మధు, నవీన్‌పై సస్పెన్షన్ వేటు

- ఇద్దరు ఎమ్మెల్సీలపై చర్యలకు అసెంబ్లీ తీర్మానం
- కేసీఆర్ క్షమాపణ చెప్పాలంటూ తీర్మానంలో ప్రస్తావన
- కౌన్సిల్‌లో చర్చకు వెళ్లిన తీర్మానం..
- ఆసక్తికరంగా మారిన తదుపరి పరిణామాలు

హైదరాబాద్, సెప్టెంబర్: తెలంగాణ శాసన మండలిలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధుసూదన్, నవీన్ రెడ్డిలపై చర్యలకు రంగం సిద్ధమైంది. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై తాతా మధు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం.. ఇద్దరు ఎమ్మెల్సీలపై చర్యలు తీసుకోవాలంటూ అసెంబ్లీలో తీర్మానం ఆమోదించింది.

2లో

# ఎర్రవెల్లి దారిలోనే బ్రేక్.. కేటీఆర్, హరీశ్‌రావు అరెస్ట్

కేసీఆర్‌ను కలిసేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ అగ్రనేతలను మేడ్చల్ వద్ద అదుపులోకి తీసుకున్న పోలీసులు

రోడ్డుపైనే నిరసనకు దిగిన కేటీఆర్, హరీశ్‌రావు.. పోలీసులతో వాగ్వాదం, తోపులాట

బోయిన్‌పల్లి, జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్లకు తరలింపు.. ఉద్రిక్తంగా మారిన పరిస్థితులు



తెలంగాణ రాజకీయాల్లో మరోసారి ఉద్రిక్తత చోటుచేసుకుంది. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసేందుకు వెళ్తున్న పార్టీ అగ్రనేతల ప్రయాణాన్ని పోలీసులు అడ్డుకోవడంతో తీవ్ర రాజకీయ దుమారం రేగింది.

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు పలువురు ఎమ్మెల్యేలను మేడ్చల్ ప్రాంతంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అసెంబ్లీ నుంచి ఎర్రవెల్లి వైపు బయలుదేరిన బీఆర్ఎస్ నేతల కాన్వాయ్ ముందుకు సాగకుండా పోలీసులు రహదారిపై బారికేడ్లు ఏర్పాటు చేశారు.



# అసెంబ్లీ ఘటనపై సీఎం సీరియస్..

## గడ్డం ప్రసాద్‌ను కలసి ధైర్యం చెప్పిన రేవంత్, భట్టి

కంటతడి పెట్టిన స్పీకర్.. సభాపతి అవమానంపై ప్రభుత్వ ఆగ్రహం.. బాధ్యులపై చర్యలు

అసెంబ్లీ ప్రాంగణంలో జరిగిన ఘటనతో మనస్తాపానికి గురైన స్పీకర్‌ను పరామర్శించిన సీఎం, డిప్యూటీ సీఎం

సభాపతిపై వ్యక్తిగత విమర్శల తీరుపై రేవంత్ తీవ్ర విచారం

బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు ఉంటాయని ప్రసాద్‌కు హామీ

2లో



# చిరంజీవి కుమార్తె సుస్మితకు కీలక పదవి..

## దుర్గమ్మ ఆలయ బోర్డులో చోటు

విజయవాడ దుర్గమ్మ ఆలయ ట్రస్ట్ బోర్డులో ప్రత్యేక ఆహ్వానితురాలిగా నియామకం

ఆలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యాలపై సలహాలు ఇవ్వనున్న సుస్మిత

తెలంగాణ యాదాద్రి బోర్డులో సభ్యురాలిగా కొనసాగుతున్న చిరంజీవి అర్ధాంగి సురేఖ

మెగాస్టార్ చిరంజీవి కుమార్తె, సినీ నిర్మాత కొణిదెల సుస్మితకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో కీలక బాధ్యతలు లభించాయి. విజయవాడ

2లో

# ఎర్రవెల్లిలో హైటెన్షన్...



హైదరాబాద్: గజ్వేల్ నియోజకవర్గంలోని ఎర్రవెల్లి ఒక్కసారిగా పోలీసుల పహారాలోకి వెళ్లింది. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నివాసం వద్దకు కాంగ్రెస్ ఎస్సీ సెల్ కార్యకర్తలు చేరేందుకు ఇచ్చిన పిలుపుతో ఉద్రిక్తత తలెత్తే అవకాశం ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఫామ్‌హౌస్ పరిసరాల్లో ఆంక్షలు విధించారు. ఎర్రవెల్లి ప్రాంతంలో 144 సెక్షన్‌ను అమల్లోకి తీసుకొచ్చిన



కేసీఆర్ ఫామ్‌హౌస్ చుట్టూ పోలీసు వలయం

ఎర్రవెల్లిలో పరిస్థితులు అదుపు తప్పకుండా 144 సెక్షన్ అమలు

కాంగ్రెస్ ఆందోళన నేపథ్యంలో ప్రధాన మార్గాలపై పోలీసుల కట్టుదిట్టమైన బందోబస్తు

ఫామ్‌హౌస్ వైపు వెళ్లే మార్గాలన్నింటినీ బారికేడ్లతో మూసివేసిన పోలీసులు

బీఆర్ఎస్ ధర్నా శిబిరం తొలగింపు.. ఆందోళనకారుల కోసం పోలీసు వాహనాలు సిద్ధం

2లో



# ఉత్తరాంధ్రలో వైసీపీకి గట్టి ఎదురుదెబ్బ

## కుమార్తెతో కలిసి.. చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన బొత్స మేనల్లుడు చిన్న శ్రీను

ఇవాళ వైసీపీకి రాజీనామా చేసిన చిన్న శ్రీను

వెంటనే చంద్రబాబును కలిసిన వైనం

కండువా కప్పి సాదరంగా టీడీపీలోకి ఆహ్వానించిన చంద్రబాబు

చిన్న శ్రీను కుమార్తె సిరి సహస్ర కూడా టీడీపీలో చేరిన వైనం

ఉత్తరాంధ్ర రాజకీయాల్లో, ముఖ్యంగా వైసీపీలో ప్రకంపనలు రేగాయి. ఆ పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ మేనల్లుడు, విజయనగరం జిల్లాలో బలమైన నేతగా ఉన్న మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) తెలుగుదేశం పార్టీలో చేరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయనకు పసుపు కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.



# హక్కుల కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నించడం నేరమా?: వైఎస్ జగన్

తాడేపల్లి : ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కాకినాడలో శాంతియుతంగా ర్యాలీ చేసిన నిరుద్యోగులపై కూటమి ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరించి కేసులు పెట్టడంపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు.

# తమిళనాడు అసెంబ్లీలో సీఎం విజయ్ సైగ...

## భగ్గుమన్న డీఎంకే

స్టాలిన్ దవడ పగిలిందంటూ ఎగతాళి చేశారని డీఎంకే ఆరోపణ

తన సైగ ఉద్దేశపూర్వకం కాదంటూ 'ఎక్స్'లో విజయ్ వివరణ

విజయ్ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించేందుకు స్పీకర్ నిరాకరణ

సభలో గౌరవం లోపించిందంటూ స్టాలిన్ వ్యాఖ్య

తమిళనాడు అసెంబ్లీలో ముఖ్యమంత్రి విజయ్

2లో

# "నాకేం తెలియదు.. అంతా నా భర్తే చూసుకుంటాడు"

పోలీసుల ముందు నందన వాదన

వీసాల వ్యవహారంతో తనకు ఎలాంటి సంబంధం లేదని విచారణలో నందన స్పష్టీకరణ

వ్యాపార లావాదేవీలు, కంపెనీ వ్యవహారాలు భర్త మధుకర్ చూసుకునేవాడని వెల్లడి

సమాధానాలు పూర్తిగా రాకపోవడంతో ఈ నెల 16న మరోసారి హాజరుకావాలని పోలీసుల ఆదేశం



హైదరాబాద్: వీసాల పేరుతో నగదు వసూలు చేశారన్న ఫిర్యాదులపై కొనసాగుతున్న దర్యాప్తులో యూట్యూబర్ నందన వాంగ్మూలం ఇప్పుడు కీలకంగా మారింది. ఇబ్రహీంపట్నం పోలీసుల ఎదుట మంగళవారం హాజరైన ఆమె..

2లో

# ఉల్లి ఘాటు చికెన్ జోరు..

మళ్లీ పెరిగిన ఇంటి భోజనం ఖర్చు

ఆగస్టులో స్వల్పంగా పెరిగిన ఇంటి భోజనం ఖర్చు

గతేడాదితో పోలిస్తే 5 శాతం పెరిగిన నాన్-వెజ్ థాలీ ధర

ఉల్లి ధరలు 43 శాతం పెరగడమే ప్రధాన కారణమని వెల్లడి

టమాటా, బంగాళాదుంప ధరలు తగ్గడంతో కొంత ఊరట

రానున్న 2-3 నెలలు ఉల్లి ధరలు అధికంగానే ఉంటాయని అంచనా

2లో



# కేసీఆర్‌పై వ్యాఖ్యల దుమారం..

### కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై కేసులకు ప్రశాంత్‌రెడ్డి డిమాండ్

### కేసీఆర్ ప్రాణాలకు ముప్పు కలిగించేలా వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై ఆగ్రహం

### వీర్లపల్లి శంకర్, వేముల వీరేశంపై డీజీపీ స్వయంగా కేసు నమోదు చేయాలని డిమాండ్

### కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ నేతలు దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శ

**హైదరాబాద్, సెప్టెంబర్ 8 (నేటి ప్రస్థానం):** మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను ఉద్దేశించి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర వివాదానికి దారితీశాయని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ప్రజా ప్రతినిధుల స్థాయి వ్యక్తులు మాజీ ముఖ్యమంత్రిని లక్ష్యంగా చేసుకుని ప్రాణహాని కలిగించే రీతిలో మాట్లాడటం తీవ్రమైన అంశమని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి వ్యాఖ్యలపై రాష్ట్ర పోలీసు యంత్రాంగం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మంగళవారం మాట్లాడిన ప్రశాంత్‌రెడ్డి.. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించారు. కేసీఆర్ ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌ను ముట్టడిస్తామని, అక్కడ 'చావు డప్పు' కొడతామని ఆయన బహిరంగంగా చెప్పడం సరికాదని అభ్యంతరం వ్యక్తం చేశారు.

**సీఎం ప్రమేయం ఉందంటూ ఆరోపణ**

వీర్లపల్లి శంకర్ వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమే కాదని ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగానే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఈ తరహా వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సమయంలో బీఆర్‌ఎస్ సభ్యులు సభకు హాజరుకాకుండా అడ్డుకునే ఉద్దేశంతో కేసీఆర్ నివాసం వైపు కాంగ్రెస్ శ్రేణులను పంపడం ఏమిటని ప్రశ్నించారు. కేసీఆర్‌ను నేరుగా రాజకీయంగా ఎదుర్కొనే పరిస్థితి లేకే అధికార పార్టీ నేతలు వ్యక్తిగత స్థాయిలో విమర్శలకు దిగుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. మాజీ ముఖ్యమంత్రిని చావు పేరుతో ప్రస్తావించడం పట్ల సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ ప్రజలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

**డీజీపీ చర్యలు తీసుకోవాలని డిమాండ్**

మాజీ ముఖ్యమంత్రి భద్రతకు ముప్పు కలిగించేలా వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, వేముల వీరేశంపై పోలీసులు వెంటనే కేసులు నమోదు చేయాలని ప్రశాంత్‌రెడ్డి కోరారు. ఈ విషయంలో డీజీపీ స్వయంగా స్పందించి చట్టపరమైన చర్యలకు శ్రీకారం చుట్టాలని అన్నారు. రాజకీయ ప్రత్యర్థులపై విమర్శలు చేయడం సాధారణమే అయినప్పటికీ, వ్యక్తుల ప్రాణాలను ఉద్దేశించే వ్యాఖ్యలకు ప్రజా జీవితంలో చోటు ఉండకూడదని ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ప్రభుత్వం, పోలీసు శాఖ ఎలా స్పందిస్తాయన్నది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

# గణేశ్ ఉత్సవాలపై పోలీసుల ఫోకస్..

## ఆ తేదీలోపే నిమజ్జనం పూర్తి చేయాలి!






- వినాయక ఉత్సవాల వేళ అలర్ట్.. మండపాల నుంచి నిమజ్జనం వరకు నిబంధనలు
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు.. 25లోగా గణేశ్ నిమజ్జనాలు పూర్తి చేయాలని సూచన
- మండపాల నుంచి నిమజ్జన ప్రాంతాల వరకు భద్రతపై పోలీసుల దృష్టి
- అనుమానాస్పద కదలికలు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని సూచన

**గుమ్మడిదల, సెప్టెంబర్ 8 (నేటి ప్రస్థానం):** గణేశ్ ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా నిర్వాహకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిన్నారం సీఐ రమణరెడ్డి స్పష్టం చేశారు. ఉత్సవాల నిర్వహణలో ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్ట ప్రకారం చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. సెప్టెంబర్ 25వ తేదీలోపు విగ్రహాల నిమజ్జన ప్రక్రియను ముగించాలని సూచించారు. గుమ్మడిదలలోని జీఎస్ఎన్ గార్డెన్‌లో ఎస్ఐ అరుణ్‌కుమార్ పర్యవేక్షణలో జరిగిన శాంతి కమిటీ సమావేశంలో సీఐ మాట్లాడారు. విగ్రహాలను ఏర్పాటు చేసే దశ నుంచి ఉత్సవాల ముగింపు వరకు పోలీసుల సూచనలకు అనుగుణంగా కార్యక్రమాలను కొనసాగించాలని నిర్వాహకులకు సూచించారు. మండపాల వద్ద భక్తుల రద్దీని నియంత్రించడం, ఊరేగింపుల సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడటం, అధిక శబ్దంతో ప్రజలకు ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు పాటించడం వంటి అంశాలపై అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. మండపాలు, ఊరేగింపు మార్గాల్లో ఏదైనా అనుమానాస్పద వస్తువు లేదా వ్యక్తి కనిపించినా నిర్వాహకులు స్వయంగా స్పందించకుండా పోలీసులకు సమాచారం అందించాలని రమణరెడ్డి కోరారు. ఉత్సవాల పేరుతో నిబంధనలను పక్కనపెట్టే వారికి ఎలాంటి మినహాయింపు ఉండదని స్పష్టం చేశారు. నిమజ్జన ఏర్పాట్లపై మున్సిపల్ కమిషనర్ దశరథ్ వివరించారు. నిమజ్జన కేంద్రాల వద్ద విద్యుత్ వెలుగులు, క్రేన్ల సదుపాయం, పారిశుద్ధ్య నిర్వహణ తదితర ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. భక్తులకు అన్నదానం నిర్వహించే నిర్వాహకులు వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయకుండా తగిన చెత్త డబ్బాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.మండపాల వద్ద విద్యుత్ భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని విద్యుత్ శాఖ ఏఈ రవీందర్ సూచించారు. విద్యుత్ స్తంభాలు, తీగలకు సురక్షిత దూరం పాటించాలని, ప్రమాణాలు కలిగిన విద్యుత్ సామగ్రినే ఉపయోగించాలని చెప్పారు. విద్యుత్ శాఖ అనుమతి లేకుండా కనెక్షన్లు తీసుకోవడం ప్రమాదకరమని, అలాంటి చర్యలకు దూరంగా ఉండాలని నిర్వాహకులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు, పోలీస్ సిబ్బంది, నాయకులు, ఉత్సవ నిర్వాహకులు, యువకులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో గొల్ల కుంటతండా గ్రామం లో తండావాసుల సమస్యలు తీర్చాలని వినతి పత్రం...

అల్లాదుర్గ్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు సోమవారం MRO, ఫీూణూలను కలిసి వినతిపత్రం అందజేశారు. గొల్లకుంట తండాకు నూతన గ్రామ పంచాయతీ భవనం మంజూరు చేయాలని కోరారు.గొల్లకుంట తండా -- కోమటికుంట తండా మధ్య అధ్వానంగా ఉన్న రహదారిని వెంటనే నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. వర్షాకాలంలో రోడ్డు బురదమయంగా మారడంతో తండావాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. అల్లాదుర్గంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 24 గంటల అత్యవసర వైద్య సేవలు అందించే ఆసుపత్రిగా అప్గ్రేడ్ చేయాలని బీఆర్ఎస్ నాయకులు శివరామ్ రాంజీ నాయక్, సంతోష్ నాయక్ తదితరులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో తహసీల్దార్, ఎంపీడీవోలకు వినతిపత్రం అందజేశారు. మండలంలో అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు సకాలంలో వైద్య సేవలు అందుబాటులో లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

## పాలిటెక్నిక్ కాలేజీల భూములపై కన్ను శక్తిలో విలీనానికి రేవంత్ సర్కారు కుట్ర

### బిజెపి కాంటెస్టెడ్ ఎమ్మెల్యే మరియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏనుగు సుదర్శన్ రెడ్డి...




మంగళవారం మేడ్చల్ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీని బీజేపీ యువ మోర్చా రాష్ట్ర నాయకులు బండారి పవన్ రెడ్డి,జిల్లా నాయకులు రామన్నగారి శ్రీనివాస్ గౌడ్ మరియు మేడ్చల్ మున్సిపల్ మాజీ అధ్యక్షులు కొండం ఆంజనేయులు ముదిరాజ్ లతో కలసి శక్తి అంశంపై సందర్శించిన సందర్భంగా... రాష్ట్రంలో ముఖ్యమంత్రి తన అధీనంలో ఉన్న అన్ని శాఖల పనితీరు పూర్తిగా నిర్వీర్యం చేస్తూ అక్రమ డబ్బులు దండుకునే విషయంలో ముమ్మరంగా ప్రయత్నం చేస్తున్నారని,అందులో బాగంగా రాష్ట్రంలో ఉన్న 54 పాలిటెక్నిక్ కాలేజీల భూములపై కన్నేసి సాంకేతిక విద్యా శాఖ ఉండాల్సిన పాలిటెక్నిక్ కాలేజీలను శక్తి పేరుతో పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్యంతో (పీపీపీ) ప్రవేటీకరణ చేసే కుట్రను బీజేపీ పార్టీ పక్షాన తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు,ఈ యొక్క విలీనం వల్ల విద్యార్థులకు బిటెక్ రెండవ సంవత్సరంలో చేరే అవకాశం మృగ్యం అవ్వడం వంటి అన్యాయపు విధానం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు,ఉన్నత విద్యా శాఖ నుండి కార్మిక శాఖలో విలీనం పట్ల తమను స్కిల్డ్ లేబర్ గా ప్రభుత్వం చూస్తున్నట్టుగా విద్యార్థులు విద్యార్థులు ఆవేదన చెందుతున్నారని వారి బాధ వర్ణనాతీతం అని ఆవేదన వ్యక్తం చేశారు....ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు చెరువుకొమ్ము శ్రీనివాస్ గౌడ్ వంశీధర్ రెడ్డి,రాఘవ రెడ్డి,ఎల్లంపేట మున్సిపల్ ప్రధాన కార్యదర్శి కంచుకట్ల మహేష్,మేడ్చల్ డివిజన్ కార్యదర్శి బండి విష్ణు మూర్తి గౌడ్,శ్రీపాల్ రెడ్డి,కేశవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు....

# స్పీకర్ నిర్ణయం వెనక్కి? బీఆర్ఎస్‌పై కీలక వ్యాఖ్యలు చేసిన గడ్డం ప్రసాద్

### బీఆర్ఎస్ ఎమ్మెల్సీలపై తొందరపడి చర్యలు తీసుకునే ఉద్దేశం లేదని స్పీకర్ స్పష్టీకరణ

### కేసీఆర్ స్వయంగా అసెంబ్లీకి వచ్చి క్షమాపణ చెప్పాలని విజ్ఞప్తి

### తాతా మధు వ్యాఖ్యలతో తీవ్ర మనస్తాపం.. సభను నడపలేనంటూ స్పీకర్ భావోద్వేగం

హైదరాబాద్, సెప్టెంబర్ 8 (నేటి ప్రస్థానం): అసెంబ్లీలో సోమవారం చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కీలక ప్రకటన చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీల విషయంలో ఏకపక్షంగా వ్యవహరించే ఉద్దేశం ప్రభుత్వానికి, తనకు లేదని స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారమే తదుపరి చర్యలు ఉంటాయని వెల్లడించారు. ఇదే సమయంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీకి హాజరై జరిగిన పరిణామాలపై తనతో మాట్లాడాలని కోరారు. మంగళవారం సభలో మాట్లాడిన స్పీకర్.. గతంలో ఎన్నడూ ఎదురుకాని పరిస్థితిని నిన్నటి ఘటన తనకు కలిగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాతా మధుసూదన్ చేసిన వ్యాఖ్యలతో తీవ్రంగా కలత చెందానని చెప్పారు. ఈ పరిస్థితుల్లో చైర్‌లో కూర్చొని సభను కొనసాగించేందుకు తన మనసు అంగీకరించడం లేదని పేర్కొన్నారు. తాను ఎప్పుడూ మీడియా ముందుకొచ్చి తన బాధను వ్యక్తం చేయలేదని ప్రసాద్‌కుమార్ తెలిపారు. సభలో అందరినీ సమానంగా చూసే ప్రయత్నం చేస్తున్నానని, ప్రజాస్వామ్య సంప్రదాయాలకు అనుగుణంగానే కార్యకలాపాలను కొనసాగిస్తున్నానని చెప్పారు. అయితే నిన్నటి పరిణామాలపై బీఆర్ఎస్ సభ్యులు తనను సంప్రదించి



విచారం వ్యక్తం చేస్తారని ఆశించానని, అలా జరగకపోగా సభ దృష్టిని ఇతర అంశాల వైపు మళ్లించే ప్రయత్నం జరుగుతోందని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ సభ్యులపై తాను తొలిసారిగా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నానని స్పీకర్ చెప్పారు. తనను ఇంతకుముందెప్పుడూ ఎవరూ ఈ స్థాయిలో అవమానించే పరిస్థితి రాలేదన్నారు. జరిగిన ఘటనపై తాను తీవ్ర భావోద్వేగానికి గురయ్యానని, అందుకే మంగళవారం సభా కార్యక్రమాలను స్వయంగా కొనసాగించలేని పరిస్థితి ఏర్పడిందని వివరించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా అసెంబ్లీకి వచ్చి తనతో మాట్లాడాలని స్పీకర్ కోరారు. సభ ప్రారంభానికి ముందు తాను సాధారణంగా కేసీఆర్‌కు ఫోన్ చేస్తుంటానని గుర్తుచేశారు. ఆరోగ్యం సహకరిస్తే అసెంబ్లీకి వస్తానని కేసీఆర్ తనతో చెబుతుంటారని తెలిపారు. ప్రస్తుతం ఏర్పడిన పరిస్థితులకు ముగింపు పలకడానికి కేసీఆర్ చొరవ చూపాలని సూచించారు. అలాగే శాసనసభ సభ్యుడు కాకపోయినా ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌పై చర్యలు తీసుకునే అధికారం తనకు ఉందని స్పీకర్ స్పష్టం చేశారు. అయితే బీఆర్ఎస్‌కు చెందిన ఎమ్మెల్సీలందరిపై ఒకే రీతిలో నిర్ణయం తీసుకోవాలనే ఆలోచన లేదని తెలిపారు. ప్రతి అంశాన్ని నిబంధనల పరిధిలో పరిశీలిస్తామని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, తన మానసిక స్థితి దృష్ట్యా సభ నిర్వహణ బాధ్యతలను ప్యానెల్ స్పీకర్‌కు అప్పగించాలని నిర్ణయించినట్లు ప్రసాద్‌కుమార్ తెలిపారు. కడియం శ్రీహరిని ప్యానెల్ స్పీకర్‌గా చైర్‌లో కూర్చోబెట్టనున్నట్లు వెల్లడించారు. తాతా మధు చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో తక్షణం సభాపతి స్థానంలో కూర్చోవడానికి తాను సిద్ధంగా లేనని స్పీకర్ స్పష్టం చేశారు.

## వరి సాగు వివరాలు 10లోగా నమోదు చేసుకుంటేనే

### క్వింటాలు ధాన్యానికి రూ.500 బోనస్ .. ఎంఎఓ ఋష్యేంద్రమణి



మిర్యాలగూడ, సెప్టెంబర్ 7: ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్ర ప్రభుత్వం సూచించిన ఏడు రకాల వరి వంగడాలను సాగు చేసిన రైతులు ఈ నెల 10లోగా తప్పనిసరిగా ఈ ఒక్క పని నమోదు చేసుకుంటేనే ధాన్యంపై క్వింటాలుకు రూ.500 బోనస్ అందుతుందని లేకుంటే కోల్పోవాల్సి ఉంటుందని మిర్యాలగూడ మండల వ్యవసాయ అధికారి ఎం. ఋష్యేంద్రమణి తెలిపారు. సోమవారం విలేఖరులతో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన బిపిటీ -5204, కెఎన్ఎం-1638, తెలంగాణ సోనా, హెచ్ఎంటీ, జెఎస్ఆర్, డబ్ల్యూజిఎల్ -44, కెఎన్ఎం -7715 వరి వంగడాలను సాగు చేసిన రైతులు బోనస్ పొందేందుకు టీ-అగ్రిఫీల్డ్ పోర్టల్‌లో సెప్టెంబర్ 10లోగా తమ సాగు వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని లేకుంటే బోనస్ కోల్పోయే ప్రమాదం ఉందని ఆమె అన్నారు.డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, విత్తనాల కొనుగోలు బిల్లుతో సంబంధిత డీలర్ వద్దనే సాగు వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. సొంత విత్తనాలు లేదా కృషి విజ్ఞాన కేంద్రాల్లో, ఇతర రైతుల వద్ద విత్తనాలు కొనుగోలు చేసి సాగు చేసిన రైతులు ఎఒ, ఎఇఒ వద్ద గాని స్వీయ ధృవీకరణ పత్రం సమర్పించి సంబంధిత అధికారులను సంప్రదించి నమోదు చేసుకోవాలన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా చూడాలని, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా విక్రయాలు ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను నిర్వహించాలని డీలర్లకు సూచించారు. డీలర్లు ఆన్ లైన్ చేయకుంటే ఫిర్యాదు చేయాలని కోరారు.రైతులు నిర్ణీత గడువులోగా తమ సాగు వివరాలను నమోదు చేసుకొని, ప్రభుత్వం ప్రకటించిన క్వింటాలుకు రూ.500 బోనస్‌ను పొందాలని ఆమె కోరారు.

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక

# కేటీఆర్ వ్యాఖ్యలతో మరోసారి రాజకీయ దుమారం..

**రేవంత్ సర్కారుపై తీవ్ర ఆరోపణలు**

**సభాపతి కులాన్ని రాజకీయ ప్రయోజనాలకు సీఎం వినియోగిస్తున్నారని కేటీఆర్ ఆరోపణ**

**మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసుల వ్యవహారశైలిపై ఆగ్రహం**

**కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని స్పష్టీకరణ**

హైదరాబాద్, సెప్టెంబర్ 8 (నేటి ప్రస్థానం): తెలంగాణ రాజకీయాల్లో మరోసారి మాటల యుద్ధం ముదిరింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీరుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రభుత్వాన్ని నిలదీస్తున్న ప్రతిపక్ష ప్రజాప్రతినిధులపై పోలీసు చర్యలకు దిగడం, అసెంబ్లీ వ్యవహారాల్లో అధికార పక్షం వ్యవహరిస్తున్న తీరును ఆయన తప్పుబట్టారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సామాజిక నేపథ్యాన్ని కూడా రాజకీయంగా ఉపయోగించుకుంటున్నారని సీఎం రేవంత్‌రెడ్డిపై ఆరోపణలు చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన కేటీఆర్.. గజ్వేల్‌లో చోటుచేసుకున్న పరిణామాలను ప్రస్తావిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతలు, ప్రజాప్రతినిధులపై పోలీసులు వ్యవహరించిన తీరును ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. ముఖ్యమంత్రి ఆలోచనా విధానాన్ని ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తమ మాటల ద్వారా బయటపెట్టారని వ్యాఖ్యానించారు. మహిళా ఎమ్మెల్యేల విషయంలోనూ పోలీసుల తీరును కేటీఆర్ ప్రశ్నించారు. మహిళా ప్రజాప్రతినిధులపై బలప్రయోగం చేయడం, వారి దుస్తులను లాగడం వంటి ఘటనలు చోటుచేసుకోవడం ఆందోళనకరమన్నారు. ప్రజల తరపున ప్రశ్నలు అడుగుతున్న ప్రతిపక్ష నేతలను అడ్డుకోవడం



ద్వారా ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవాలని చూస్తోందని విమర్శించారు. కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలపైనా కేటీఆర్ స్పందించారు. తెలంగాణ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఎందుకు లక్ష్యంగా చేసుకుంటున్నారని ప్రశ్నించారు. మరణం అనేది ప్రతి ఒక్కరికీ సహజమేనని, అయితే కాంగ్రెస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలు రాజకీయ సంస్కృతికి విరుద్ధంగా ఉన్నాయని



మండిపడ్డారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అగ్రనేతలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని కేటీఆర్ ఆరోపించారు. యువతకు కల్పిస్తామని చెప్పిన ఉద్యోగాలు, మహిళలకు ప్రకటించిన నెలవారీ ఆర్థిక సాయం, ఆడపిల్లలకు ఇస్తామని చెప్పిన స్కూటీల వంటి హామీల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఈ అంశాలపై ప్రజల్లో ఇప్పటికే ప్రశ్నలు మొదలయ్యాయని అన్నారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు పార్టీ అధినేత కేసీఆర్‌ను కలిసేందుకు వెళ్తుండగా అరెస్టులు చేశారని కేటీఆర్ ఆరోపించారు. తాము పోలీస్ స్టేషన్‌లో ఉన్న సమయంలో కాంగ్రెస్ నాయకులు అక్కడికి వచ్చి దాడికి పాల్పడ్డారని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ హామీల అమలుపై అసెంబ్లీ వేదికగా ప్రశ్నించాలన్నదే తమ పార్టీ నిర్ణయమని స్పష్టం చేశారు. ప్రభుత్వంపై పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని కేటీఆర్ ప్రకటించారు. అసెంబ్లీ సమావేశాలకు హాజరై ప్రజలకు ఇచ్చిన హామీలపై అధికార పక్షాన్ని సమాధానం చెప్పేలా చేస్తామని అన్నారు. ప్రభుత్వం తమపై ఎన్ని చర్యలు తీసుకున్నా ప్రజా సమస్యలను లేవనెత్తడం ఆపబోమని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీరును నియంత హిట్లర్‌తో పోల్చుతూ కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. హిట్లర్‌కు ఎదురైన పరిణామాలే రేవంత్‌రెడ్డికీ ఎదురవుతాయని వ్యాఖ్యానించారు. తమ పార్టీ నేతలు, కార్యకర్తలపై జరిగిన దాడులకు బాధ్యులైన వారిని వదిలిపెట్టబోమని హెచ్చరించారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ప్రకటించిన హామీలన్నింటినీ ప్రజల ముందుకు తీసుకెళ్లి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు.

## కొలనుపాక సోమేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రత్యేక పూజలు

**ఆలేరు సెప్టెంబర్:** ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలోని శ్రీ సోమేశ్వర స్వామి ఆలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారికి భక్తిశ్రద్ధలతో అభిషేకం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేసి ఆశీర్వాదాలు పొందారు. అనంతరం ఆలయ అర్చకులు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలతో పాటు ఆలేరు నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, ప్రతి కుటుంబంలో శాంతి, సౌభాగ్యం నెలకొనాలని శ్రీ సోమేశ్వర స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కులంపాక ఉపసర్పంచ్ గొట్టం విజయేందర్ రెడ్డి మదర్ డైరీ డైరెక్టర్ కలపెల్లి శ్రీశైలం వంగపల్లి మాజీ సర్పంచ్ కానుగు బాలరాజు శ్రీనివాస్ మాజీ ఎంపిటిసి అరె ప్రశాంత్ బండ జహంగీర్ తదిరులు పాల్గొన్నారు.

## యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో అవకాశాలు కల్పించాలి

**ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు సైనిక యూత్ మోటివేషనల్ సొసైటీ వినతి**

**ఆలేరు సెప్టెంబర్:** రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ పోలీసు ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్న నిరుపేద విద్యార్థులకు అండగా నిలిచేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో తమ సంస్థ సభ్యులకు, విద్యార్థులకు అవకాశాలు కల్పించాలని కోరుతూ సైనిక యూత్ మోటివేషనల్ సొసైటీ ప్రతినిధులు ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు వినతిపత్రం అందజేశారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుపేద యువతకు ఉద్యోగ నోటిఫికేషన్లపై అవగాహన కల్పించడం, ఎలా చదవాలి, పోటీ పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలి, గ్రౌండ్ ప్రాక్టీస్‌ను ఏ విధంగా నిర్వహించాలి తదితర అంశాలపై సైనిక యూత్ మోటివేషనల్ సొసైటీ వాట్సాప్ మాధ్యమం ద్వారా ఉచిత శిక్షణ అందిస్తోందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ద్వారా ఇప్పటివరకు దాదాపు 200 మంది ఉద్యోగాలు సాధించేందుకు సంస్థ విశేషంగా కృషి చేసిందన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసే యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో సైనిక యూత్ మోటివేషనల్ సొసైటీ సభ్యులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు, సంస్థ ద్వారా ఉద్యోగాలకు సిద్ధమవుతున్న నిరుపేద విద్యార్థులకు సెంటర్‌లో శిక్షణ పొందే అవకాశం కల్పించాలని ఎమ్మెల్యేను కోరారు. సంస్థ అందిస్తున్న సేవలను ప్రభుత్వం గుర్తించి, మరింత మంది యువతను దేశ సేవలోకి తీసుకురావడానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు, వారిని ప్రోత్సహించేందుకు సంస్థ చేస్తున్న కృషిని అభినందించారు. ప్రభుత్వం తరఫున, తన వంతుగా సహకారం అందిస్తానని, కోరిన విధంగా యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూనే గ్రామీణ ప్రాంతాల యువతను ప్రోత్సహిస్తూ, వారిని ఉద్యోగులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్న సైనిక యూత్ మోటివేషనల్ సొసైటీ ఫౌండర్, జనరల్ సెక్రటరీ బండారి ప్రసాద్ ముదిరాజ్‌ను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో సైనిక యూత్ మోటివేషనల్ సొసైటీ ప్రతినిధులు, స్థానిక ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఓటర్ల జాబితాలో తప్పిదం సవరణకు ధ్రువీకరణ పత్రం అందజేత

**ఆలేరు, సెప్టెంబర్:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ఓటర్ల జాబితాలో తన తండ్రి పేరు తప్పుగా ప్రచురితమైన నేపథ్యంలో ఆలేరు మాజీ జెడ్పీటీసీ బొట్ల పరమేశ్వర్‌కు ఎన్నికల నమోదు అధికారి కార్యాలయం నుంచి నోటీసులు జారీ అయ్యాయి. ఈ నేపథ్యంలో సంబంధిత ధ్రువీకరణ పత్రాలను సోమవారం స్థానిక పోచమ్మవాడలో జరిగిన కార్యక్రమంలో ఎన్నికల నమోదు అధికారి, ఆలేరు డిప్యూటీ తహసీల్దార్ బి. రాందాస్‌కు బొట్ల పరమేశ్వర్ అందజేశారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితాలో నమోదైన తప్పిదాన్ని సరిచేసేందుకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను అధికారులకు సమర్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) బి. నాగేందర్, ఎం.డి. ఫాతిమా, కె. వెంకటేష్, కె. సుధీర్, కంప్యూటర్ ఆపరేటర్ పి. నరేష్ పాల్గొన్నారు.

# మహిళా పోలీసుల కన్నీటి గోడు..

**సీతక్కకు చూపించిన కీలక ఆధారాలు**

**అసెంబ్లీ వద్ద జరిగిన ఘటనపై మహిళా సిబ్బంది నుంచి మంత్రికి ఫిర్యాదు**

**తమపై అనుచితంగా వ్యవహరించారంటూ బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై ఆరోపణలు**

**బెదిరింపులకు వెరవొద్దని పోలీసు సిబ్బందికి సీతక్క భరోసా**



**హైదరాబాద్, సెప్టెంబర్ 8 (నేటి ప్రస్థానం):** అసెంబ్లీ పరిసరాల్లో విధి నిర్వహణ సందర్భంగా ఎదురైన చేదు అనుభవాలను మహిళా పోలీసు సిబ్బంది మంత్రి సీతక్క ఎదుట ఏకరువు పెట్టారు. సోమవారం అసెంబ్లీ ప్రధాన ద్వారం వద్ద చోటుచేసుకున్న ఘర్షణలో గాయపడిన మహిళా పోలీసులను మంగళవారం మంత్రి పరామర్శించారు. ఈ సందర్భంగా ఘటనకు సంబంధించిన పరిస్థితులను సిబ్బంది వివరించడంతో పాటు తమ వద్ద ఉన్న ఫోటోలు, వీడియో దృశ్యాలను మంత్రికి చూపించారు. విధి నిర్వహణ సమయంలో కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తమతో అనుచితంగా వ్యవహరించారని మహిళా పోలీసు అధికారులు ఆరోపించారు. తమను ఉద్దేశపూర్వకంగా తాకారని, దుస్తులు విసురుతూ తమ వైపు దూసుకొచ్చారని వారు మంత్రికి వివరించినట్లు తెలిపారు. ఈ పరిణామాల కారణంగా విధి నిర్వహణలో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయని చెప్పారు. ఘటనకు సంబంధించిన దృశ్యాలు బయటకు రావడంతో తమ కుటుంబ సభ్యులు ఆందోళనకు గురవుతున్నారని మహిళా సిబ్బంది సీతక్క దృష్టికి తీసుకెళ్లారు. ఇలాంటి పరిస్థితుల్లో విధులు నిర్వహించాల్సిన అవసరం లేదంటూ కుటుంబ సభ్యుల నుంచి ఒత్తిడి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా భవిష్యత్‌లో అధికారంలోకి వచ్చిన తర్వాత తమను చూస్తామని కొందరు బెదిరించినట్లు వారు పేర్కొన్నారు. మహిళా పోలీసుల ఫిర్యాదును మంత్రి సీతక్క సావధానంగా విన్నారు. విధి నిర్వహణలో ఎదురైన పరిణామాలపై వారికి ధైర్యం చెప్పారు. ప్రభుత్వ పరంగా పూర్తి సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా బాధ్యతలను నిర్వర్తించాలని సూచించారు.

**'మీకు ప్రభుత్వం అండగా ఉంది'.... సీతక్క**

బెదిరింపులు లేదా ఒత్తిళ్ల కారణంగా విధులకు దూరం కావాల్సిన అవసరం లేదని సీతక్క స్పష్టం చేశారు. ధైర్యంగా పనిచేయాలని, ప్రభుత్వం తమకు రక్షణగా ఉంటుందని మహిళా పోలీసులకు హామీ ఇచ్చారు. ప్రజా సేవలో భాగంగా విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని భరోసా కల్పించారు.

# స్పీకర్ విషయంలో హరీశ్‌రావు తీరుపై శ్రీధర్‌బాబు ఫైర్.. చర్యలు తప్పవంటూ హెచ్చరిక

**సభాపతి వ్యవహారాల్లో ప్రతిపక్ష నేతలు జోక్యం చేసుకోవడంపై మంత్రి శ్రీధర్‌బాబు అభ్యంతరం**

**స్పీకర్‌పై చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన దృశ్యాలు స్పష్టంగా ఉన్నాయని వెల్లడి**

**మహిళా ఎమ్మెల్యేల అంశంపై నివేదిక కోరిన విషయాన్ని గుర్తుచేస్తూ బీఆర్ఎస్‌పై విమర్శలు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 8 (నేటి ప్రస్థానం):** శాసనసభలో స్పీకర్ స్థానానికి ఉన్న రాజ్యాంగబద్ధమైన గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. సభాపతిని ఉద్దేశించి మాజీ మంత్రి హరీశ్‌రావు వ్యవహరించిన తీరుపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. స్పీకర్‌కు సూచనలు చేయడం, సభను ఎలా నిర్వహించాలో నిర్దేశించే ప్రయత్నం చేయడం సరైన పద్ధతి కాదని స్పష్టం చేశారు. స్పీకర్ స్థానంలో ఉన్న వ్యక్తిపై బెదిరింపు ధోరణి ప్రదర్శించడం శాసనసభ సంప్రదాయాలకు విరుద్ధమని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. సభలో చోటుచేసుకున్న పరిణామాలకు సంబంధించిన వీడియో రికార్డులు అందుబాటులో ఉన్నాయని, వాటిని పరిశీలిస్తే ఎవరు ఏ విధంగా మాట్లాడారన్నది స్పష్టమవుతుందని తెలిపారు. మహిళా ప్రజాప్రతినిధులకు సంబంధించిన ఘటనను ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ బీఆర్ఎస్ చేస్తున్న



విమర్శలను మంత్రి ఖండించారు. ఈ అంశంపై సమగ్ర వివరాలతో నివేదిక ఇవ్వాలని స్పీకర్ ఇప్పటికే అధికారులను ఆదేశించారని చెప్పారు. ఒకవైపు మహిళా ఎమ్మెల్యేల అంశాన్ని ప్రస్తావిస్తూ.. మరోవైపు సభాపతిపై జరిగిన అవమానకర పరిణామాన్ని విస్మరించాలని కోరడం సరైన విధానం కాదని వ్యాఖ్యానించారు. శాసనసభ వ్యవస్థకు ఉన్న ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని ప్రతి అంశాన్నీ నిబంధనల ప్రకారమే పరిశీలించాల్సి ఉంటుందని శ్రీధర్‌బాబు అన్నారు. స్పీకర్‌పై జరిగిన అనుచిత వ్యాఖ్యలను తేలిగ్గా తీసుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. చట్టసభలో సభ్యుల ప్రవర్తనకు సంబంధించి నిర్దిష్టమైన నియమాలు ఉన్నాయని మంత్రి గుర్తుచేశారు. వాటిని ఉల్లంఘించిన ఘటనలపై అందుబాటులో ఉన్న ఆధారాలు, సభా నియమావళిని పరిగణనలోకి తీసుకుని నిర్ణయం ఉంటుందని తెలిపారు. రాజ్యాంగబద్ధమైన పదవుల గౌరవాన్ని కాపాడటం అందరి బాధ్యత అని స్పష్టం చేస్తూ.. బాధ్యుల విషయంలో నిబంధనల మేరకు చర్యలు కొనసాగుతాయని శ్రీధర్‌బాబు తేల్చిచెప్పారు.



# బతుకమ్మపై యువత క్రియేటివిటీకి ఛాన్స్..

కోమటిరెడ్డి చేతుల మీదుగా కీలక ప్రకటన

తెలంగాణ సంస్కృతిని తెరపై ఆవిష్కరించేలా యువతకు ప్రత్యేక వేదిక

షార్ట్‌ఫిలింలు, పాటలు, క్రియేటివ్ వీడియోలతో ప్రతిభ చాటుకునే అవకాశం

'బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్--2026' పోస్టర్ ఆవిష్కరించిన కోమటిరెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబర్ 8 (నేటి ప్రస్థానం):** తెలంగాణ సంస్కృతికి ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకురావడంతో పాటు యువతలో దాగి ఉన్న సృజనాత్మకతకు పదును పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో వేదికను అందుబాటులోకి తీసుకొచ్చింది. బతుకమ్మ పండుగ నేపథ్యంగా యువ ఫిలిం మేకర్ల కోసం నిర్వహించనున్న "బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్--2026"కు సంబంధించిన పోస్టర్‌ను రాష్ట్ర సినిమాటోగ్రఫీ, రోడ్లు-భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంగళవారం సచివాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ పండుగలు, సంప్రదాయాలు, జానపద కళలను ఆధునిక సృజనాత్మకతతో ప్రపంచానికి పరిచయం చేయడానికి యువత ముందుకు రావాలని కోరారు. తమ ఆలోచనలకు దృశ్యరూపం ఇచ్చేందుకు ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. బతుకమ్మ ప్రత్యేకతను ప్రధానాంశంగా చేసుకుని యువ దర్శకులు తమకు నచ్చిన విధంగా కథనాలను రూపొందించవచ్చని మంత్రి తెలిపారు. షార్ట్‌ఫిలింలతో పాటు బతుకమ్మ పాటలు, వినూత్న వీడియోల రూపంలోనూ తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశం ఉందన్నారు. తెలంగాణ జీవనశైలి, స్థానిక సంప్రదాయాలు, జానపద కళారూపాలు వంటి అంశాలను సృజనాత్మకంగా ఆవిష్కరించడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కూడా తమ చిత్రాల్లో ప్రతిబింబించవచ్చని చెప్పారు. విద్యార్థులు, ఔత్సాహిక కళాకారులు, యువ దర్శకులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆకాంక్షించారు. యువతలోని ప్రతిభకు సరైన ప్రోత్సాహం లభిస్తే తెలంగాణ సంస్కృతి, కళా వైభవాన్ని అంతర్జాతీయ స్థాయిలో మరింత ప్రభావవంతంగా పరిచయం చేయవచ్చన్నారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎఫ్‌డీసీ ఎండీ జి.ముకుందరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ క్రియేటివ్ డైరెక్టర్ రాజ్ కొండా, సెట్విన్ మాజీ చైర్మన్ గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# కేబినెట్‌లో భారీ మార్పులకు సంకేతాలా?

మహేశ్ గౌడ్ వ్యాఖ్యలతో కాంగ్రెస్‌లో చర్చ

ప్రస్తుత మంత్రిత్వ శాఖల కూర్పును మార్చాలంటూ హైకమాండ్‌కు సూచించిన పీసీసీ చీఫ్

కొత్తగా బాధ్యతలు కేటాయించే అంశంపై నిర్ణయం సీఎం, అధిష్ఠానానిదేనని స్పష్టీకరణ

తనకు మంత్రి పదవి అంశంలోనూ అధిష్ఠానం నిర్ణయమే తుది అని మహేశ్ గౌడ్ వెల్లడి

హైదరాబాద్, సెప్టెంబర్ 8 (నేటి ప్రస్థానం): తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రివర్గానికి సంబంధించి మరోసారి చర్చ మొదలైంది. మంత్రులకు ప్రస్తుతం అప్పగించిన శాఖల్లో మార్పులు చేయాల్సిన అవసరం ఉందని తాను పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్లినట్లు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ వెల్లడించారు. గాంధీ భవన్‌లో మీడియాతో అనధికారికంగా మాట్లాడిన ఆయన.. శాఖల కేటాయింపును కొత్తగా పునర్వ్యవస్థీకరించాలనే తన అభిప్రాయాన్ని హైకమాండ్‌కు తెలియజేసినట్లు చెప్పారు. పార్టీ అధ్యక్షుడిగా తన బాధ్యతలకు అనుగుణంగా ఈ సూచన చేశానని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు. అయితే ఎవరికి ఏ శాఖ ఇవ్వాలనే అంశంపై తుది నిర్ణయం తీసుకునే అధికారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ అధిష్ఠానానికే ఉంటుందని స్పష్టం చేశారు.



**పార్టీ ప్రయోజనాల కోణంలో సూచన**

కేబినెట్‌లోని శాఖల బాధ్యతలను పునఃపరిశీలించి కొత్త కేటాయింపులు చేయడం ద్వారా పార్టీకి, ప్రభుత్వానికి ప్రయోజనం కలుగుతుందనే ఉద్దేశంతోనే తన అభిప్రాయాన్ని చెప్పినట్లు మహేశ్ గౌడ్ తెలిపారు. ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు కాంగ్రెస్ వర్గాల్లో ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఇదిలా ఉండగా, తనను మంత్రివర్గంలోకి తీసుకుంటారన్న ప్రచారంపైనా మహేశ్ గౌడ్ స్పందించారు. ఈ విషయంలో తాను ఎలాంటి నిర్ణయం ఆశించడం లేదని, పూర్తి అంశాన్ని అధిష్ఠానం పరిశీలనకే వదిలేశానని చెప్పారు.

**పార్టీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నా..**

ప్రస్తుతం తన దృష్టి పీసీసీ అధ్యక్షుడిగా పార్టీని మరింత బలోపేతం చేయడంపైనే ఉందని మహేశ్ గౌడ్ తెలిపారు. పార్టీ సంస్థాగత వ్యవహారాలు, కాంగ్రెస్ బలోపేతానికి సంబంధించిన బాధ్యతలను నిర్వర్తిస్తున్నానని పేర్కొన్నారు. మంత్రివర్గ విస్తరణ, శాఖల పునర్వ్యవస్థీకరణపై ఇప్పటికే రాజకీయ వర్గాల్లో పలు ఊహాగానాలు వినిపిస్తున్న నేపథ్యంలో మహేశ్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. అయితే తుది కూర్పు, శాఖల మార్పులపై నిర్ణయం మాత్రం సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ హైకమాండ్ తీసుకోవాల్సి ఉంటుంది.

# గౌరవ సభకు గౌరవమే లేకుండా పోయిందా?


రేవంత్ పాలనపై హరీశ్‌రావు తీవ్ర వ్యాఖ్యలు.. అసెంబ్లీ తీరుపైనా మండిపాటు

హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందంటూ ధ్వజం

విద్యార్థులు, నిరుద్యోగులు, రైతుల సమస్యలపై సీఎం సమాధానం చెప్పాలని డిమాండ్

మహిళా ఎమ్మెల్యేల పట్ల వ్యవహరించిన తీరును ఖండించిన బీఆర్ఎస్ నేత

హైదరాబాద్, సెప్టెంబర్ 8 (నేటి ప్రస్థానం): తెలంగాణ రాజకీయాల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం మరింత ముదురుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వ పాలన, శాసనసభలో జరుగుతున్న పరిణామాలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజకీయ వ్యూహాలను అనుసరిస్తున్నారని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలు విషయంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఎన్నికల సమయంలో అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే హామీలను నెరవేరుస్తామని కాంగ్రెస్ చెప్పిందని హరీశ్‌రావు గుర్తుచేశారు. అయితే ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన దాటినా ఆరు గ్యారంటీలకు సంబంధించి పూర్తి స్థాయి అమలు కనిపించడం లేదని అన్నారు. హామీలను పక్కనపెట్టి వివిధ వర్గాలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యంగా విద్యార్థులు, ఉద్యోగార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన ప్రస్తావించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో అందక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతలో నిరాశ నెలకొందని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రకటించిన జాబ్ క్యాలెండర్ ఆచరణలో ఉద్యోగాల క్యాలెండర్‌గా మారలేదని ఎద్దేవా చేశారు. రైతుల అంశంపైనా హరీశ్‌రావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అవసరమైన సమయంలో యూరియా అందక రైతులు అవస్థలు పడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా విషయంలోనూ ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలపై ముఖ్యమంత్రి సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఇదే సమయంలో రాష్ట్రంలో ప్రజాస్వామ్య పరిస్థితులపై కూడా హరీశ్‌రావు ప్రశ్నలు సంధించారు. అసెంబ్లీ ప్రధాన ద్వారం వద్ద బీఆర్ఎస్‌కు చెందిన మహిళా ఎమ్మెల్యేలతో జరిగిన పరిణామాలను ప్రజలు చూశారని అన్నారు. అక్కడ ఇబ్బందులకు గురైన మహిళా ఎమ్మెల్యేలపైనే కేసులు నమోదు చేయడం సరికాదని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై వారికి ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. శాసనసభ ప్రజా సమస్యలపై చర్చించాల్సిన వేదికగా ఉండాల్సి ఉండగా, చర్చకు బదులుగా ఇతర అంశాలతో సమయాన్ని గడుపుతున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. సభ గౌరవాన్ని కాపాడాల్సిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రజా సమస్యలపై సమాధానాలు ఇవ్వకుండా సభా వ్యవస్థను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యానికి ప్రతీకగా ఉండాల్సిన శాసనసభను కౌరవ సభలా మార్చుతున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.





# కేటీఆర్, హరీశ్‌రావు అరెస్టులకు నిరసనగా ఆలేరులో బీఆర్ఎస్ రాస్తారోకో

ఆలేరు: బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ మహిళా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అకారణంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ ఆలేరు మండల, పట్టణ బీఆర్ఎస్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని బస్టాండ్ ఎదుట పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో ఆరు గ్యారంటీలు, ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజాస్వామ్యబద్ధంగా, శాంతియుతంగా నిరసన తెలిపేందుకు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు నల్లచొక్కాలు ధరించి అసెంబ్లీకి వచ్చారని తెలిపారు. అయితే వారిని పోలీసులు నిర్దాక్షిణ్యంగా అరెస్టు చేయడంతో పాటు మహిళా ప్రజాప్రతినిధులను సైతం ఈడ్చుకెళ్లడం అప్రజాస్వామిక చర్య అని మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును ప్రభుత్వం గౌరవించాలని, అక్రమ అరెస్టులను వెంటనే నిలిపివేయాలని నాయకులు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై ఎన్ని నిర్బంధాలు విధించినా ప్రజా సమస్యలపై తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గంగుల శ్రీనివాస్ యాదవ్, పట్టణ పార్టీ అధ్యక్షుడు పుట్ట మల్లేష్ గౌడ్, మాజీ జడ్పీటీసీ బొట్ల పరమేశ్వర్, సెక్రటరీ జనరల్ ఉండే సంపత్, కౌన్సిలర్లు యాట శివ, పాకాల మౌనిక, హరీశ్, బీజని మధుకుమార్, ఎస్.రెడ్డి, మహేందర్‌రెడ్డి, కోటగిరి పాండర్‌గౌడ్, మాజీ కౌన్సిలర్ బేతి రాములు, జూకంటి చిన్న, ఉప్పలయ్య, తమ్మడి ఆశయ, వడ్డే శోభన్‌కుమార్, బండ మహేందర్, హరికృష్ణ, ఎండీ ఫయాజ్, హరిగా చంద్రశేఖర్, టింకు, మొగిలి, పాక కృష్ణ, కూతాటి అంజన్‌కుమార్, ఆరె మల్లేష్‌గౌడ్, బండి రాజు, బండి నరేందర్ తదితరులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలంగాణ రైతులకు అంతర్జాతీయ మార్కెట్..

ఫిలిప్పీన్స్‌తో వాణిజ్య విస్తరణకు ఉత్తమ్ ప్లాన్

ఫిలిప్పీన్స్‌కు తెలంగాణ బియ్యం.. భారీ ఆర్డర్లపై ఉత్తమ్ కీలక చర్చలు

ఎగుమతులు పెంచేందుకు కీలక అడుగు.. వాణిజ్య విస్తరణపై ఉత్తమ్ చర్చలు

బియ్యంతోపాటు విత్తనాలు, మాంస ఉత్పత్తుల కొనుగోలుపైనా చర్చ

ధర, నాణ్యత, రవాణా, దిగుమతి నిబంధనలపై అధికారుల స్థాయిలో కార్యాచరణ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8:తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తులకు అంతర్జాతీయ విపణిలో మరిన్ని అవకాశాలు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా ఫిలిప్పీన్స్ మార్కెట్‌లో తెలంగాణ బియ్యానికి స్థానం కల్పించేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయి. ఆ దేశానికి భారీ స్థాయిలో బియ్యం సరఫరా చేయడంతోపాటు, ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలను విస్తరించే అంశంపై రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చర్చలు జరిపారు. న్యూఢిల్లీలో ఫిలిప్పీన్స్ వ్యవసా య శాఖ కార్యదర్శి, క్యాబినెట్ సభ్యుడు ఫ్రాన్సిస్కో పి. టు లారెల్ జూనియర్‌తో మంగళవారం జరిగిన భేటీలో ఈ అంశాలపై విస్తృతంగా చర్చించారు. తెలంగాణ నుంచి బియ్యం కొనుగోలు చేసే ప్రతిపాదనకు లారెల్ సానుకూలంగా స్పందించినట్లు ఉత్తమ్ తెలిపారు. భవిష్యత్తులో రాష్ట్రం నుంచి అధిక పరిమాణంలో బియ్యం సేకరించే అవకాశాలను పరిశీలిస్తామని ఆయన పేర్కొన్నట్లు మంత్రి వెల్లడించారు. దేశంలో వరి సాగులో తెలంగాణకు ఉన్న ప్రాధాన్యతను ఉత్తమ్ వివరించారు. పెద్ద మొత్తంలో ఉత్పత్తి చేయగల సామర్థ్యంతో పాటు ఆధునిక మిల్లింగ్ సదుపాయాలు రాష్ట్రంలో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. నాణ్యతను పాటిస్తూ అంతర్జాతీయ అవసరాలకు అనుగుణంగా బియ్యాన్ని సరఫరా చేయగల సామర్థ్యం తెలంగా ణకు ఉందని వివరించారు. ఫిలిప్పీన్స్ దిగుమతిదారులు, సంబంధిత ప్రభుత్వ విభాగాలు, ఎగుమతిదారులు, రైస్ మిల్లర్లను సమన్వయం చేసి ముందుకు వెళ్లే విధానంపైనా చర్చ జరిగినట్లు ఉత్తమ్ తెలిపారు. బియ్యం రకాలు, ధరల నిర్ణయం, నాణ్యతా ప్రమాణాలు, కొనుగోలు విధానం, రవాణా వ్యవస్థతో పాటు ధ్రువీకరణ, ఆరోగ్య, వృక్ష సంబంధిత దిగుమతి నిబంధనలను పరిశీలించాల్సి ఉందని చెప్పారు. వీటిపై అధికారులు, పరిశ్రమ వర్గాలతో సమగ్రంగా చర్చించి కార్యాచరణ రూపొందిం చనున్నట్లు వెల్లడించారు. అంతర్జాతీయంగా బియ్యం కోసం ఫిలిప్పీన్స్‌కు గణనీయమైన అవసరం ఉందని, దిగుమతుల కోసం మరిన్ని దేశాల వైపు చూడాలనే ఆ దేశ ప్రయత్నాల నేపథ్యంలో తెలంగాణకు అవకాశం ఏర్పడుతోం దని మంత్రి పేర్కొన్నారు. ధర విషయంలో పోటీని తట్టుకోవడంతోపాటు నాణ్యత, సరఫరాలో విశ్వసనీయతను నిర్ధారించగలిగితే దీర్ఘకాలిక వ్యాపార సంబంధాలకు మార్గం సుగమమవు తుందని అన్నారు. ఇదే భేటీలో తెలంగాణ నుంచి విత్తనాలు, మాంస ఉత్పత్తులను సైతం సేకరించే అంశంపై ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి ఆసక్తి చూపినట్లు ఉత్తమ్ తెలిపారు. ఆ ప్రతిపాదనను స్వాగతించిన ఆయన.. విత్తనోత్పత్తి, ఆహార ప్రాసెసింగ్, వ్యవసాయ అనుబంధ రంగాల్లో రాష్ట్రానికి ఉన్న సామర్థ్యాన్ని వివరించారు. ఫిలిప్పీన్స్ మార్కెట్‌కు సరిపోయే ఉత్పత్తులు, అవసరమైన అనుమతులు, నాణ్యతా నిబంధనలు, ఇతర నియంత్రణ అంశాలను పరిశీలించనున్నట్లు మంత్రి చెప్పారు. రాష్ట్ర వ్యవసాయ ఉత్పత్తులకు విదేశీ మార్కెట్లను అందుబాటులోకి తీసుకురా వడం ద్వారా రైతులతో పాటు రైస్ మిల్లింగ్ రంగం, విత్తన సంస్థలు, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు కొత్త అవకాశాలు లభిస్తాయని ఉత్తమ్ పేర్కొన్నారు. తెలంగాణ వ్యవసాయ రంగానికి దీర్ఘకాలికంగా ప్రయోజనం చేకూర్చే అంతర్జాతీయ మార్కెట్లను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.



# ఎడిటోరియల్

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక

## సమగ్ర పంటల విధానమే మేలు!




**దేశంలో పంటల విధానంపై సమగ్రత లోపించింది. రైతులు తమకు తోచిన పంటలు వేస్తున్నారు. ధరల కోసం దేబురిస్తున్నారు. ప్రభుత్వాలు వీలైనంత మేరకు కొంటున్నాయి. వీలుకాకపోతే చేతులెత్తేస్తున్నాయి. ముఖ్యంగా వరి, జొన్న, మక్కజొన్నలనే పండించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటికే దేశంలో ధాన్యం బాగా పోగయ్యింది.**

డిమాండ్ ఉన్న పంటలు వేయడం, సేంద్రియం వైపు మళ్లడంలో రైతులు ఇప్పటికీ వెనకడుగు వేస్తున్నారు. దీంతో సంప్రదాయ వరి పండిస్తూ చేతులు కాల్చుకుంటున్నారు. ఈ విధానం ముందుగా పోవాలి. ప్రభుత్వాలు కూడా రైతులను చైతన్యం చేయడం లేదా, ఫలానా పంటలు వేయండి అని చెప్పడం లేదు. తెలంగాణ రైతుల పరిస్థితి తీసుకుంటే ఇదే అర్థం అవుతోంది. సన్నాలు పండించిన వారికి గిట్టుబాటు ధరలు వస్తున్నాయి. మద్దతు ధరలను మించి కొంటున్నారు. తాజాగా మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మార్కెట్ యార్డులో సన్న వడ్లకు డిమాండ్ పెరిగింది. వరుసగా రెండ్రోజుల నుంచి 3వేలకు పైగానే మద్దతు ధరలు దక్కుతున్నాయి. ప్రభుత్వం కూడా సన్నాలు పండించాలని, ఏడు రకాలను తాజాగా గుర్తించింది. కానీ మండలాల వారిగా రైతులతో మాట్లాడి వారిని ఒప్పించి, రైతుల పంటల విధానంలో మార్పులు తీసుకుని రావాల్సి ఉంది. ఇవన్నీ ఒక ఎత్తయితే కేంద్రం కూడా ధాన్యం మొత్తాన్ని కొనడానికి ముందుకు రావడం లేదు. టార్గెట్లు విధించి, ఆమేరకు ధాన్యం సేకరణకు రాష్ట్ర ప్రభుత్వాలకు చెబుతోంది. గతంలో బిఆర్ఎస్ అధికారంలో ఉండగా ఇలాగే జరిగింది. ఢిల్లీలో కూడా బిఆర్ఎస్ అధినేత, ఆనాటి సిఎం కెసిఆర్ ధర్నాకు దిగారు. అయినా నేటికీ మార్పు రాలేదు. అందువల్ల రాష్ట్రాలు తమకుతాముగా సమగ్ర పంటల విధానం అమలు చేయాలి. కేవలం ఉచిత విద్యుత్, రైతుభరోసా డబ్బులు వేస్తే సరిపోదు. ఏ పంటలు వేయాలో, వాటికి మార్కెటింగ్ ఎలా ఉంటుందో తెలియచేయాలి. ప్రభుత్వాల జోక్యం లేకుండానే రైతులు పంటలు అమ్ముకునే పరిస్థితిని తీసుకుని రావాలి. ఇక విషయానికి వస్తే ఖరీఫ్ ముంచుకొస్తున్న వేళ రబీ పంటల కొనుగోళ్లు ఇంకా సాగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో పంటల కొనుగోళ్లపై కాంగ్రెస్ సర్కార్ చేతులెత్తేసింది. రైతులు పండించిన చివరి గింజ వరకు కొంటామంటూ చెబుతూ వచ్చిన మంత్రులు, ఇప్పుడు ఊహించని రీతిలో ప్రకటన చేశారు. ధాన్యం, మక్కజొన్న, జొన్న, కందులు, పెసర్లు.. ఇలా పంట ఏదైనా సరే ఇక రాష్ట్ర ప్రభుత్వం తరపున పంటలు కొనుగోలు చేసే ప్రసక్తే లేదని తేల్చి చెప్పింది. కేంద్ర ప్రభుత్వం ఎంత కొనాలని చెబితే అంతే కొంటామని, అంతకుమించి గింజ కూడా ఎక్కువ కొనేది లేదని స్పష్టంచేసింది. గురువారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఇన్‌ఫార్మల్ క్యాబినెట్ సమావేశంలో పంటల కొనుగోళ్లపై సంచలన నిర్ణయం తీసుకున్నది. ధాన్యం, మక్కలు, జొన్నలు, కందులు, పెసర్లు ఇలా పంటల కొనుగోళ్ల బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపైకి నెట్టేసింది. రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే ఏ పంటనైనా సరే కేంద్రం నిర్దేశించిన కోటా మేరకే కొనుగోలు చేస్తామని మంత్రి ఉత్తమ్ మీడియాకు చెప్పారు. పంటలకు మద్దతు ధరను కేంద్రమే నిర్ణయిస్తుంది కాబట్టి.. పంటల కొనుగోలు బాధ్యత కూడా కేంద్ర ప్రభుత్వానిదేనని అన్నారు. మంత్రి వ్యాఖ్యల నేపథ్యంలో ఇకపై రైతులు పండించిన పంటలను కొనుగోలు చేయబోదనేది సుస్పష్టం. కేంద్రం కొనుగోలు చేస్తామని చెప్పిన పంటలను, కేంద్రం ఇచ్చిన కోటా మేరకే ఇక్కడ కేంద్రం ఇచ్చిన డబ్బులతో రైతుల నుంచి సేకరించి కేంద్రానికి అందిస్తుంది. అంతేగానీ ఒకవేళ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన కోటాకు మించి పంటలు ఉత్పత్తి అయితే ఆ పంటలను రాష్ట్ర ప్రభుత్వం తన సొంత నిధులతో కొనుగోలు చేయబోదు. పంటల కొనుగోళ్లలో కేంద్రం కోటా పూర్తికాగానే ఆ కేంద్రాలను మూసివేస్తుంది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యంతో పాటు ఇతర పంటలు ఉన్నా ఇక నుంచి ప్రభుత్వం పట్టించుకోదు. మొత్తంగా ఇదే విషయం అర్థం అవుతోంది. ఇలాంటి సమయంలో ఏం చేయాలన్నది కూడా ప్రభుత్వం ప్రకటించాలి. ఎంతమేరకు వరి వేయాలో, అదికూడా ఏ రకం వేయాలో రైతులకు చెప్పాలి. ఏయే జిల్లాల్లో వరి వేయాలో, వేయకూడదో కూడా నిర్ణయించాలి. నిజానికి ధాన్యం సేకరణ బాధ్యత కేంద్రానిదే. కేంద్రం ఆదేశాల మేరకే రాష్ట్రాలు ధాన్యం సేకరణ చేసి, ఎఫ్‌సిఐకి అప్పగిస్తుంది. ఈ క్రమంలో ఁరాష్ట్రంలోని వివిధ పంటలను కేంద్ర ప్రభుత్వం కొంత మేరకే కొనుగోలు చేస్తుంది. ఉత్పత్తి అయిన ధాన్యంలో మూడో వంతు మాత్రమే కొంటుంది. ఇక పెసర్లు, కందులు, జొన్నలు, సన్‌ఫ్లవర్, సోయాబీన్ వంటి పంటలను మొత్తం ఉత్పత్తిలో 25శాతం మాత్రమే కొనుగోలు చేస్తుంది. ఒకవేళ కేంద్ర ప్రభుత్వానికి అవసరముండి, పంట ఎక్కువగా ఉంటే మరో 5-10శాతం వరకు కొనుగోలుకు అనుమతి ఇస్తుంది. ఒత్తిడి తెచ్చినర రాష్ట్రాలకే ఈ వెసులబాటు ఉంటుంది. ఇకపోతే కేంద్ర ప్రభుత్వం.. మక్కలను మాత్రం అసలే కొనుగోలు చేయదు. ఎంత ఉత్పత్తి అయినా సరే ఒక్క గింజ కూడా కొనుగోలు చేయదు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం తన కోటా కింద కొనుగోలు చేయగా మిగిలిన పంటలను కొనుగోలు చేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదే.

## భయరహిత ఆలోచనే సృజనాత్మకతకు మూలం


**ఒక బిడ్డ పుట్టినప్పుడు దాని చేతిలో ఎలాంటి రాతా ఉండదు. తల్లి గర్భం అనే చీకటి గది నుంచి బయటి ప్రపంచంలోకి అడుగుపెట్టే ఆ పవిత్ర క్షణంలో, అది ఏ కులానికో, ఏ మతానికో, ఏ హోదాకో చెందినదని చెప్పడానికి దానికి ఏ హక్కూ ఉండదు, ఏ ఎంపికా ఉండదు. కానీ, ఈ సమాజం మాత్రం ఆ పసికందు నుదుటిపై పుట్టుకతోనే ఒక శాశ్వత ముద్ర వేసేస్తుంది. నువ్వు గొప్పవాడివి అని కొందరికి సింహాసనాలు వేస్తే, నువ్వు హీనుడివి అని మరికొందరిని దూరంగా నెట్టేస్తుంది. ఈ ముద్ర వేయడంలో ఆ బిడ్డ గుణగణాలతో కానీ, దాని భవిష్యత్తు కృషితో కానీ ఎలాంటి సంబంధం ఉండదు.**

కేవలం అది ఏ ఇంట్లో, ఏ వంశంలో జన్మించిందనే ఒక్క విషయమే దాని జీవితాంతం నీడలా వెంటాడుతూ ఉంటుంది. ఇది ఎంతవరకు న్యాయం? మనిషి విలువను అతని జన్మ నిర్ణయించాలా, లేక అతని కర్మ నిర్ణయించాలా అనే ప్రశ్న వేల సంవత్సరాలుగా మన సామాజిక మనస్సాక్షిని తొలిచివేస్తూనే ఉంది. భారతదేశంలో కుల వ్యవస్థ శతాబ్దాలుగా మనుషులను జన్మ ప్రాతిపదికన నిలువుగా విభజించింది. ఒకరు కేవలం ఉన్నతవర్గంలో పుట్టారనే కారణంతో సమాజంలో అప్రయత్నంగానే గౌరవం పొందితే, మరొకరు అట్టడుగు వర్గంలో పుట్టారనే కారణంతో జీవితాంతం అవమానాలు, వివక్షలు ఎదుర్కొన్నారు. ఎంతటి ప్రతిభావంతుడైనా, ఎంతటి సద్గుణ సంపన్నుడైనా, అతని జన్మ తక్కువ కులంలో జరిగిందంటే చాలు అతనికి కనీస విద్యనభ్యసించే హక్కు లేదు, దేవాలయంలో అడుగుపెట్టే అర్హత లేదు, దాహాన్ని తీర్చుకోవడానికి మంచినీళ్ల బావి దగ్గరికి వెళ్ళే స్వేచ్ఛ లేదు. ఇది మానవ చరిత్రలోనే అత్యంత దారుణమైన, అవమానకరమైన అన్యాయాలలో ఒకటి. ఒక మనిషి తన స్వయంకృషితో సాధించిన దానికి కాకుండా, అతని తల్లిదండ్రులు ఎవరనే దానికి సమాజం విలువ ఇవ్వడం ఎంత అవివేకమో, ఎంత అమానుషమో ఆలోచిస్తేనే ఆశ్చర్యం కలుగుతుంది. నిజానికి మన పురాతన గ్రంథాలు సైతం ఈ విషయంలో చాలా లోతైన, స్పష్టమైన సందేశాన్ని ఇచ్చాయి. భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్మ పేర్కొన్న ప్రసిద్ధ శ్లోకం."చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మ విభాగశః"

దీని అంతరార్థం ఏమిటంటే సమాజంలో వర్ణ విభజన అనేది మనుషుల అంతర్గత గుణాల ఆధారంగా, వారు చేసే కర్మల (పనుల) ఆధారంగా జరిగిందే తప్ప, కేవలం పుట్టుక ఆధారంగా కాదు. అంటే మూలంలోనే ఈ జీవన సూత్రం మనిషి చేసే పనులను, అతని స్వభావాన్ని ప్రాతిపదికగా తీసుకుందే తప్ప, అతని జన్మను కాదు. కానీ కాలక్రమేణా స్వార్థ పూరిత శక్తుల వల్ల ఈ సూత్రం పూర్తిగా వక్రీకరించబడింది. పుట్టుకే మనిషి యొక్క సర్వస్వాన్ని నిర్ణయించే ప్రధాన అంశంగా మారిపోయింది. ఇది మానవ పరిణామ క్రమంలో జరిగిన అత్యంత దురదృష్టకరమైన పరిణామం.

మన ఇతిహాసాలు, పురాణాలు చూసినా ఇందుకు ఎన్నో గొప్ప ఉదాహరణలు కనిపిస్తాయి. వాల్మీకి మహర్షి ఒక బోయవానిగా జన్మించినా, తన కఠోర తపస్సుతో, అపార జ్ఞానంతో రామాయణ మహాకావ్యాన్ని రచించి ఆదికవి అనే అత్యున్నత గౌరవాన్ని పొందారు. వేదవ్యాసుడు ఒక సాధారణ మత్స్యకారిణి పుత్రుడిగా జన్మించినా వేదాలను నాలుగు భాగాలుగా విభజించి, మహాభారతాన్ని రచించి నేటికీ జగద్గురువుగా నిలిచారు. విదురుడు దాసీపుత్రుడిగా జన్మించినా తన విజ్ఞతతో, నీతిశాస్త్ర పరిజ్ఞానంతో హస్తినాపుర సభలో అత్యంత గౌరవనీయుడైన ముఖ్యమంత్రిగా నిలిచారు. ఏకలవ్యుడి అచంచల గురుభక్తి, కర్ణుడి అసమాన దానగుణం ఇవన్నీ వారి పుట్టుకతో సంబంధం లేకుండా వారి వ్యక్తిత్వంలోని మహోన్నతమైన గొప్పతనాన్ని చాటిచెప్పాయి. ఈ కథలన్నీ మనకు గట్టిగా చెప్పే నిజం ఒక్కటే మనిషి గొప్పతనం అతని రక్తంలో ప్రవహించదు, అతని కృషిలో, అతని గుణంలో మాత్రమే దాగి ఉంటుంది.

జన్మ ఆధారిత వివక్షకు వ్యతిరేకంగా ఎందరో మహనీయులు తమ జీవితాలను అంకితం చేసి పోరాడారు. పన్నెండవ శతాబ్దంలోనే మహాత్మా బసవేశ్వరుడు కుల గోత్రాలు అడగొద్దు, మనుషుల మధ్య బేధాలు చూపొద్దు అని గర్జించారు. జ్యోతిబా పూలే, సావిత్రీబాయి పూలే దంపతులు సమాజంలోని అట్టడుగు వర్గాల, మహిళల విద్యా హక్కు కోసం రాళ్లూ రప్పల దెబ్బలు తింటూనే తమ జీవితాంతం పోరాడారు. బాబాసాహెబ్ డా. బి.ఆర్. అంబేద్కర్ తాను స్వయంగా ఎదుర్కొన్న భయంకరమైన జన్మ ఆధారిత అవమానాలను మౌనంగా సహించి, చదువునే ఆయుధంగా చేసుకుని తనను తాను నిరూపించుకున్నారు. చివరికి దేశానికే దిక్సూచి లాంటి భారత రాజ్యాంగ నిర్మాతగా చరిత్రలో శాశ్వత స్థానం పొందారు. ఆయన అద్భుత జీవితమే జన్మ కంటే కర్మ గొప్పదని నిరూపించిన సజీవ సాక్ష్యం. తెలుగు నేలపై కందుకూరి వీరేశలింగం పంతులు, గురజాడ అప్పారావు వంటి సంఘ సంస్కర్తలు తమ కలాల ద్వారా, ఆచరణ ద్వారా ఈ వివక్షపై తీవ్రంగా పోరాడారు. గురజాడ అప్పారావు తన ప్రసిద్ధ దేశభక్తి గేయంలో దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్ అని చెబుతూ, మనుషుల మధ్య కుల మత భేదాలు లేకుండా అందరూ సమానంగా కలిసిమెలిసి ఉండాలని చాటారు. గోరా (గోపరాజు రామచంద్రరావు) నాస్తిక ఉద్యమం ద్వారా కుల వ్యవస్థను వేళ్లతో సహా ప్రశ్నించి, కేవలం మానవత్వమే మనిషికి అసలైన గుర్తింపు అని నిరూపించడానికి తన సర్వస్వాన్ని ధారపోశారు.



ఇరవై ఒకటవ శతాబ్దంలో, చంద్రుడిపైకి, అంగారకుడిపైకి రోదసీ నౌకలు పంపుతున్న ఈ శాస్త్రీయ కాలంలో కూడా, జన్మ ఆధారంగా వివక్ష పూర్తిగా అంతరించిపోయిందని మనం గుండెలపై చేయి వేసుకుని చెప్పలేము. నేటికీ వివాహ సంబంధాలలో, రాజకీయాలలో, సామాజిక గుర్తింపులో కులం యొక్క నీచమైన ప్రభావం స్పష్టంగా కనిపిస్తూనే ఉంటుంది. అయితే, డా. ఎ.పి.జె. అబ్దుల్ కలాం వంటి మహానుభావులు ఒక సాధారణ రామేశ్వరం మత్స్యకార కుటుంబంలో జన్మించి, తమ అపారమైన అంకితభావంతో, శాస్త్రీయ పరిజ్ఞానంతో ఈ దేశ అత్యున్నత రాష్ట్రపతి స్థాయికి ఎదిగారు. వీరి జీవితాలు మనకు నిరంతరం గుర్తుచేస్తూనే ఉంటాయి మనిషిని శిఖరాగ్రానికి తీసుకెళ్లేది అతను పుట్టిన స్థానం కాదు, అతని పట్టుదల, అతని నైతిక విలువలు, అతని నిరంతర కృషి మాత్రమే. నిజానికి సమాజంలో ఒక మనిషి విలువను నిర్ణయించాల్సింది అతని దైనందిన ప్రవర్తన, అతని జ్ఞానం, అతని గుండెల్లోని కరుణ, అతని నిజాయితీ, సమాజానికి అతను చేసే నిస్వార్థ సేవ. ఒక వైద్యుడు తన చేతులతో ఎన్ని ప్రాణాలు కాపాడాడనే దానితో అతని గొప్పతనం నిర్ణయించబడాలి తప్ప, అతను ఏ కులంలో పుట్టాడనే దానితో కాదు. ఒక ఉపాధ్యాయుడు ఎంతమంది విద్యార్థుల జీవితాలను చీకటి నుంచి వెలుగులోకి తీర్చిదిద్దాడనే దానితో అతని విలువ తేలాలి తప్ప, అతని వంశ పారపర్యంతో కాదు. ప్రకృతి కూడా ఈ విషయంలో మనకు ఎన్నో గొప్ప పాఠాలు నేర్పుతుంది. సూర్యుడు తాను ఏ నేపథ్యం నుంచి ఉదయించాడని చూడకుండా లోకంలోని అందరిపైనా సమానంగా వెలుగునిస్తాడు. ఆకాశం నుంచి కురిసే వర్షం పేద, ధనిక, ఉన్నత, నిమ్న కులాలు అని తేడాలు చూడకుండా అందరి భూమినీ సమానంగా తడుపుతుంది. ప్రకృతికే లేని భేదాలు, మనిషికి మాత్రమే ఎందుకు? మనిషి మాత్రమే ఎందుకు ఇంత సంకుచితంగా, స్వార్థంగా ఆలోచిస్తాడు? మనిషి విలువను అతని జన్మ ఎప్పటికీ నిర్ణయించకూడదు, నిర్ణయించలేదు అనే పరమ సత్యాన్ని మనం మన గుండెల నిండా నింపుకోవాలి. పుట్టుక అనేది మన ప్రమేయం లేని, మన చేతిలో లేని ఒక యాదృచ్ఛిక సంఘటన మాత్రమే. కానీ మనం ఈ భూమిపై ఎలా జీవించాలి, ఎలాంటి వ్యక్తులుగా ఎదగాలి, సమాజానికి ఎంత మేలు చేయాలి అనేది పూర్తిగా మన చేతుల్లోనే ఉంటుంది. నిజమైన గొప్పతనం రక్తంలో పారదు, అది గుండెలో పుడుతుంది. నిజమైన ఉన్నతి వంశంలో ఉండదు, అది మనిషి వ్యక్తిత్వంలో ఉంటుంది. ఈ నాటి ఆధునిక సమాజం ఒక కొత్త విప్లవాత్మక ఆలోచనా విధానాన్ని అలవరచుకోవాలి. మనిషిని అతని జన్మతో కాకుండా అతని కర్మతో, ప్రవర్తనతో గౌరవించే సరికొత్త సంస్కృతిని మన ఇళ్లలోనే పెంపొందించాలి. మన పిల్లలకు చిన్నతనం నుంచే నువ్వు ఏ కులంలో, ఎక్కడ పుట్టావు అనేది ముఖ్యం కాదు, నువ్వు సమాజంలో ఎలాంటి మనిషిగా మారుతావు అనేదే ముఖ్యం అని ప్రేమతో నేర్పించాలి.

అప్పుడే ఈ దేశంలో నిజమైన సమానత్వం వెల్లివిరుస్తుంది, నిజమైన మానవత్వం వికసిస్తుంది. మనిషి విలువను నిర్ణయించాల్సింది అతని జన్మ కాదు అతని కర్మ, అతని ఉత్తమ గుణం, అతని నిండైన మానవత్వమే అని ప్రతి ఒక్కరూ మనస్ఫూర్తిగా గుర్తించే ఆ సుదినం త్వరలోనే రావాలని ఆశిద్దాం.

## చావు రాజకీయాలు చేయిస్తారా?

### కేసీఆర్‌ను అంతమొందించేందుకు కుట్ర
### కేసీఆర్ నివాసం ముట్టడి రేవంత్ ఆలోచనే
### బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి

హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను భౌతికంగా అంతమొందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని... స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయన చావును కోరుకుంటున్నారంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈరోజు అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ... షాద్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మీడియా ముఖంగా చేసిన అనుచిత వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ నిప్పులు చెరిగారు. కేసీఆర్ నివాసమైన ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌పై దాడులు చేస్తామని, 'చావు డప్పు' కొడతామని ఎమ్మెల్యే శంకర్ బహిరంగంగా వ్యాఖ్యానించడం రాజ్యాంగ ఉల్లంఘన అని మండిపడ్డారు. "వెయ్యి డప్పులతో కేసీఆర్ ఇల్లు ముట్టడిస్తామన్నది శంకర్ వ్యక్తిగత మాట కాదు. అది వెనుకుండి నడిపిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనే" అని ప్రశాంత్ రెడ్డి ఆరోపించారు. అసెంబ్లీ సమావేశాల వేళ సభ్యులను సభకు రానివ్వకుండా కేసీఆర్ ఫాంహౌస్ కు కాంగ్రెస్ శ్రేణులను పంపి దాడులు చేయించడాన్ని తీవ్రంగా ఖండించారు. కేసీఆర్ చావు గురించి మాట్లాడినందుకు గాను రేవంత్ రెడ్డి తక్షణమే బేషరతుగా తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్‌ను నేరుగా రాజకీయంగా ఎదుర్కొనే ధైర్యం లేకనే కాంగ్రెస్ ఈ రకమైన దిగజారుడు వ్యాఖ్యలు చేస్తోందని ఎద్దేవా చేశారు. హత్యారాజకీయాలను ప్రోత్సహిస్తూ, మాజీ ముఖ్యమంత్రి ప్రాణాలకు హాని తలపెట్టేలా తీవ్ర వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, వేముల వీరేశంలపై రాష్ట్ర డీజీపీ తక్షణమే సుమోటోగా కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



## పెంపుడు జంతువులకూ బీమా పాలసీ

పాలసీదారుల కుటుంబ సభ్యులతో పాటు పెంపుడు జంతువులకు కూడా వర్తించేలా ఫ్యామిలీ హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్‌ను బజాజ్ జనరల్ ఇన్సూరెన్స్ ప్రవేశపెట్టింది. దీని పేరు 'మై ఫ్యామిలీ కంప్లీట్'. దీని కింద రూ. 5 లక్షల నుంచి రూ. 5 కోట్ల వరకు కవరేజీ తీసుకోవచ్చు. మూడు నెలలు పైబడిన పెంపుడు పిల్లులు, శునకాలను ఇందులో చేర్చవచ్చు. పాలసీదారులకు (మనుషులకు) ఇన్-పేషంట్ హాస్పిటలైజేషన్, రూమ్ రెంట్ మొదలైన వాటికి కవరేజి ఉంటుంది. పెంపుడు జంతువులు తప్పిపోయినప్పుడు ప్రకటనలు, పారితోషికాలు ఇవ్వడానికి, పెట్ పేరెంట్ అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చేరినప్పుడు ఎమర్జెన్సీ పెట్ అకామడేషన్‌కి, బీమా ఉన్న పెంపుడు జంతువు ఏదైనా ప్రాపర్టీని ధ్వంసం చేసినా, మరణం మొదలైన వాటికి కారణంగా నిల్చినా థర్డ్ పార్టీ లయబిలిటీ కవరేజీ ఉంటుంది.

## ఈ వారం 11 ఐపీవోలు

### ఐపీవో స్ట్రీట్.. రూ. 7,055 కోట్ల సమీకరణ

### ఈ ఏడాది 75 కంపెనీల ఇష్యూలు

### ఆగస్ట్‌లోనే 23 కంపెనీల లిస్టింగ్

ప్రైమరీ మార్కెట్ల జోరు కొనసాగుతోంది. గత నెల(ఆగస్ట్)లో ఏకంగా 23 కంపెనీలు లిస్టింగ్‌కాగా.. వచ్చే వారం మరో 11 ఐపీవోలు ప్రారంభకానున్నాయి. 7--15 మధ్య చేపట్టనున్న ఇష్యూల ద్వారా ఇవి ఉమ్మడిగా రూ. 7,055 కోట్లు సమీకరించే యోచనలో ఉన్నాయి. మొత్తం రూ. 7,055 కోట్లలో రూ. 2,722 కోట్లు(39 శాతం) తాజా ఈక్విటీ జారీకాగా.. మరో రూ. 4,333 కోట్ల విలువైన షేర్లను ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. మంగళ, బుధ వారాల్లో అధిక ఇష్యూలు మార్కెట్లను పలకరించనున్నాయి. జాబితాలో రియల్టీ డెవలపర్స్, ఇంజినీరింగ్, తయారీ, పేమెంట్స్, స్పెషాలిటీ కెమికల్స్, ఆన్‌లైన్ రిటైల్ ప్లాట్‌ఫామ్ తదితర కంపెనీలున్నాయి. వీటితో కలిపి ఈ ఏడాది 75 కంపెనీలు నిధుల సమీకరణ బాటలో సాగినట్లు నమోదుకానుంది. వివరాలు చూద్దాం..

**ప్రణవ్ కన్‌స్ట్రక్షన్స్‌తో షురూ**

నేడు(7న) ప్రణవ్ కన్‌స్ట్రక్షన్స్ ఐపీవో ప్రారంభంకానుంది. 9న ముగియనున్న ఇష్యూ ద్వారా రూ. 351 కోట్లు సమీకరించనుంది. రేపు(8న) కనోహర్ ఎలక్ట్రికల్స్, ప్రసోల్ కెమికల్స్, గ్లాస్‌వాల్ సిస్టమ్స్(ఇండియా) ఇష్యూలు షురూకానుండగా.. 9న స్టీమ్‌హౌస్ ఇండియా, 10న వీగాలాండ్ డెవలపర్స్ మార్కెట్లను తాకనున్నాయి.

**ధరల శ్రేణి తీరిలా**

ప్రణవ్ కన్‌స్ట్రక్షన్స్ ఐపీవోకు ధరల శ్రేణి రూ. 118--124కాగా.. రూ. 316 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా రూ. 35 కోట్ల విలువైన మరో 28.57 లక్షల షేర్లను ఆఫర్ చేయనుంది. కనోహర్ ఎలక్ట్రికల్స్ రూ. 601--632 ధరల శ్రేణిలో రూ. 1,056 కోట్ల సమీకరణపై కన్నేసింది. ప్రసోల్ కెమికల్స్ రూ. 643--676 ధరల శ్రేణి నిర్ణయించడం ద్వారా రూ. 500 కోట్లు అందుకోనుంది. ఈక్విటీ జారీతో రూ. 80 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ ద్వారా మరో రూ. 420 కోట్లు సమీకరించనుంది. గ్లాస్‌వాల్ సిస్టమ్స్ రూ. 172--182 ధరల శ్రేణితో రూ. 428 కోట్ల సమీకరణకు రెడీ అయ్యింది.

**వీగాలాండ్ సైతం**

ఆర్సిల్ రూ. 132--139 ధరల శ్రేణిలో రూ. 733 కోట్ల సమీకరణకు సిద్ధపడింది. పూర్తిగా ప్రస్తుత వాటాదారు సంస్థలు షేర్లను విక్రయించనున్నాయి. ఇక రూ. 427 కోట్ల సమీకరణకుగాను ఎల్‌సీసీ ప్రాజెక్ట్స్ రూ. 139--146 ధరల శ్రేణి నిర్ణయించింది. స్టీమ్‌హౌస్ ఇండియా ఇష్యూలో భాగంగా రూ. 353 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. అంతేకాకుండా రూ. 61 కోట్ల విలువైన షేర్లు ఆఫర్ చేయనుంది. వెరసి రూ. 414 కోట్లు అందుకోవాలని చూస్తోంది. ఈ నెల 10న ప్రారంభమై 15న ముగియనున్న ఐపీవో ద్వారా వీగాలాండ్ డెవలపర్స్ రూ. 210 కోట్లు సమీకరించనుంది. ఈక్విటీ జారీ నిధులను వ్యాపార విస్తరణ, పెట్టుబడి వ్యయాలు, రుణ చెల్లింపులు, వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకు వినియోగించడంతోపాటు.. సాధారణ కార్పొరేట్ అవసరాలకు సైతం కేటాయించనున్నాయి. రేస్ ఆఫ్ బిలీవ్, దీపా జ్యువెలర్స్ ఐపీవోలతో ఈ నెల(సెపట?టంబర్)లో ఐపీవోల సందడి జోరందుకున్న విషయం విదితమే.

## మెదడు పెంచుకుంటున్న ఏఐ!




కృత్రిమ మేధ రంగంలో వేగంగా చోటుచేసుకుంటున్న పరిణామాలపై ఓపెన్‌ఏఐ చీఫ్ సైంటిస్ట్ జాకుబ్ పచోకీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కంపెనీ ఇటీవల అత్యంత శక్తిమంతమైన కొత్త మోడల్‌ను విడుదల చేసిన కొద్ది రోజులకే 'ూఅ ూశ్రీఅవఅ వీఱఅఉ' పేరుతో ఆయన రాసిన బ్లాగ్ పోస్ట్ ఏఐ విభాగంలో సంచలనం రేపింది. కృత్రిమ మేధలో వేగంగా వస్తోన్న పురోగతికి, వాటి వల్ల కలిగే పర్యవసానాలకు ఎవరూ సిద్ధంగా లేరని ఆయన స్పష్టం చేశారు. తమ సంస్థ అంతర్గతంగా సాంకేతిక పరిష్కారాలపై పనిచేస్తున్నప్పటికీ విస్తృత స్థాయి జోక్యాలు అవసరమని చెప్పారు. ఇందుకు థర్డ్‌పార్టీ ఆడిటర్లు, ప్రభుత్వ సంస్థలు లేదా అంతర్జాతీయ సంస్థలు అమలు చేయగల తప్పనిసరి భద్రతా ప్రమాణాలు ఉండాలని పచోకీ పిలుపునిచ్చారు. మనుషుల పర్యవేక్షణను తప్పించుకోవడం, కంప్యూటర్ వ్యవస్థల్లోకి చొరబడటం, లక్ష్యాల సాధన కోసం మనుషులను మోసగించడం వంటి పనులను స్వతంత్రంగా వ్యవహరించే ఏఐ ఏజెంట్లు చేయగలవని హెచ్చరించారు.

**ఏఐ బేరసారాలు**

మరింత కీలకంగా, భవిష్యత్తులో ఏఐ ఏజెంట్లు మనుషులతో బేరసారాలు, మోసాలు, బెదిరింపుల ద్వారా సహకారం పొందేందుకు ప్రయత్నించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఏఐను కేవలం ఒక సాధనంగా చూసే ఆలోచన నుంచి బయటపడాలని, కొన్ని ఏజెంట్లు తమ సొంత లక్ష్యాలను అనుసరించే స్థాయికి చేరుకుంటాయని ఆయన తెలిపారు.

**మూల్యాంకన పరీక్షలో మోసం**

ఈ హెచ్చరికకు ముందు, ఓపెన్‌ఏఐ రోగ్ ఏజెంట్లు హగింగ్‌ఫేస్ వ్యవస్థల్లోకి చొరబడి ఒక మూల్యాంకన పరీక్షలో మోసం చేసేందుకు యత్నించిన ఘటన వెలుగులోకి వచ్చింది. అలాగే, ఆగస్టులో యూకే ఏఐ సెక్యూరిటీ ఇన్‌స్టిట్యూట్ విడుదల చేసిన నివేదికలో ఆంత్రోపిక్ ఏఐ ఏజెంట్ ఒకటి గిట్‌హబ్ అడ్మినిస్ట్రేటర్‌ను మభ్యపెట్టి మాల్‌వేర్‌ను అప్‌లోడ్ చేయించేందుకు యత్నించిన ఉదంతం కూడా ప్రస్తావనకు వచ్చింది. ఏఐ స్వీయ-మెరుగుదల సామర్థ్యంపైనా పచోకీ ఆందోళన వ్యక్తం చేయడం, ఏఐ భద్రతపై అంతర్జాతీయంగా చర్చను తీవ్రతరం చేసింది.

### జియో కొత్త రీచార్జ్ ప్లాన్: అదిరిపోయే ఆఫర్..

రిలయన్స్ జియో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని తన వినియోగదారుల కోసం మెగా వార్షికోత్సవ ఆఫర్‌ను ప్రకటించింది. 2016 సెప్టెంబర్‌లో టెలికాం సేవలను ప్రారంభించిన జియో.. ఈ ప్రత్యేక సందర్భంలో రూ.3,599 విలువైన వార్షిక ప్రీపెయిడ్ ప్లాన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఏడాది మొత్తం కనెక్టివిటీతో పాటు ఎంటర్‌టైన్‌మెంట్, క్లౌడ్, ఏఐ సేవలను అందించడమే లక్ష్యంగా ఈ ప్లాన్‌ను రూపొందించింది.

**రూ.3,599 ప్లాన్‌లో ఏమేం లభిస్తాయి?**

ఈ ప్లాన్‌తో 365 రోజుల వ్యాలిడిటీ లభిస్తుంది. వినియోగదారులకు ప్రతిరోజూ 2.5+దీ హైస్పీడ్ డేటా చొప్పున ఏడాదికి మొత్తం 912.5+దీ డేటా అందుతుంది. దీంతో పాటు అపరిమిత వాయిస్ కాల్స్, రోజుకు 100 ూవీూలు లభిస్తాయి. అర్హత కలిగిన వినియోగదారులకు అపరిమిత 5+ డేటా ప్రయోజనం కూడా ఉంటుంది. నెలనెలా రీఛార్జ్ చేసుకోవడం ఇష్టం లేని వారికి ఈ వార్షిక ప్లాన్ ఉపయోగకరంగా ఉండనుంది. బేస్ ప్యాక్‌లో భాగంగా జియో టీవీ, జియో ఏఐ క్లౌడ్ వంటి సేవలకు కూడా యాక్సెస్ లభిస్తుంది.

**అదనపు ప్రయోజనాలు ఇవే..**

కనెక్టివిటీ ప్రయోజనాలకు అదనంగా జియో ఈ ప్లాన్‌లో పలు ఎంటర్‌టైన్‌మెంట్, డేటా బెనిఫిట్స్‌ను అందిస్తోంది.

**జియో హాట్‌స్టార్:** హాలీవుడ్ కంటెంట్‌తో కూడిన మొబైల్ సబ్‌స్క్రిప్షన్.

**జియో టీవీ ప్రో:** 1,000కుపైగా టీవీ ఛానళ్లకు యాక్సెస్. రూ.55 చొప్పున 12 నెలల వోచర్ రూపంలో ప్రయోజనం.

డేటా బూస్టర్: 12 నెలల పాటు ప్రతి నెల అదనంగా 10+దీ డేటా.

**జియో ఏఐ క్లౌడ్:** బేస్ స్టోరేజ్‌కు అదనంగా 50+దీ ఉచిత క్లౌడ్ స్టోరేజ్. రూ.35,100 గూగుల్ జెమిని ప్రో ఉచితం ఈ వార్షికోత్సవ ఆఫర్‌లో అత్యంత ఆకర్షణీయమైన ప్రయోజనం గూగుల్ జెమిని ప్రో (Google Gemini Pro) సబ్‌స్క్రిప్షన్.

## సీఎన్‌జీ, హైబ్రిడ్, ఈవీలదే రాజ్యం!




భారత ప్యాసింజర్ వాహన మార్కెట్‌లో చారిత్రక మలుపు చోటుచేసుకుంది. ఇన్నాళ్లూ కొంటే పెట్రోల్ కారే కొనాలనే తీరుకు భిన్నంగా సీఎన్‌జీ, హైబ్రిడ్, ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీలు) ముందువరుసలోకి వస్తున్నాయి. ఈక్విరస్ సెక్యూరిటీస్ నివేదిక ప్రకారం, ఆగస్టు 2026లో సీఎన్‌జీ, హైబ్రిడ్, ఈవీలు కలిపి రిటైల్ అమ్మకాల్లో 42 శాతం వాటాను దక్కించుకోగా, పెట్రోల్ వాహనాల వాటా 41 శాతానికి పడిపోయింది. ఒకప్పుడు ఏకచ్ఛత్రాధిపత్యం వహించిన పెట్రోల్ కార్లకుకు ఇది కొత్త సవాలే.

**సీఎన్‌జీ వాహనాలు ఇలా..**

గత ఏడాది ఇదే నెలలో 46 శాతంగా ఉన్న పెట్రోల్ వాటా ఇప్పుడు రికార్డు కనిష్ఠానికి చేరడం గమనార్హం. మరోవైపు సీఎన్‌జీ వాహనాలు ఏకంగా 21 శాతం నుంచి 25 శాతానికి ఎగబాకుతూ సరికొత్త రికార్డు నెలకొల్పాయి. మారుతీ సుజుకీ ఈ విభాగంలో 71 శాతం వాటాతో అగ్రస్థానంలో ఉండగా, టాటా మోటార్స్, హ్యుందాయ్ వరుసగా 17, 9 శాతాలతో పోటీపడుతున్నాయి. జీఎస్‌టీ రేట్ల తగ్గింపుతో కొనుగోలు శక్తి పెరగడం, మొత్తం వాహన అమ్మకాలు 16 శాతం వృద్ధితో సుమారు 4.01 లక్షల యూనిట్లకు చేరడానికి కారణమైంది.

**ఈవీలదే హవా**

ఇక ఈవీల సంగతికొస్తే, ఏడాది కిందటితో పోలిస్తే అమ్మకాలు 52 శాతం దూసుకెళ్లి 30,700 యూనిట్లకు చేరాయి. దీంతో ఈవీల వ్యాప్తి 5.9 శాతం నుంచి 7.7 శాతానికి పెరిగింది. అయితే జులైలో నమోదైన 8.1 శాతం రికార్డు కంటే స్వల్పంగా తక్కువే. టాటా మోటార్స్ తన ఈవీ పోర్ట్‌ఫోలియోతో 43 శాతం వాటాతో దూసుకుపోగా, జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ వాటా మాత్రం 28 శాతం నుంచి 15 శాతానికి పడిపోయింది.ఇంధన ధరల మంటలు, ఈ20 ఇథనాల్ మిశ్రమంపై కొనుగోలుదారుల సంశయమే ఈ మార్పుకు కారణమైందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. మొత్తానికి కాలం మారింది, కారు రూపమూ మారింది అన్నట్టుగా, భారత రహదారులపై ఇక పెట్రోల్ కాకుండా ప్రత్యామ్నాయ ఇంధనాలదే భవిష్యత్తు అని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

## గిట్టుబాటు ధరలతో రైతన్నకు ఊరట..?

**మరికొద్ది రోజుల్లో మండీలకు చేరనున్న ఖరీఫ్ పంటలకు కాస్త మెరుగైన ధరలు లభించేలా కనిపిస్తోంది. ప్రధాన ఉత్పత్తి రాష్ట్రాల్లో మెజారిటీ పంటలకు కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ)తో సమానంగా లేదా అంతకుమించి ధరలు పలుకుతుండటం రైతన్నలకు ఊరటనిస్తోంది. అగ్మార్క్‌నెట్ డేటా ప్రకారం, ఎంఎస్‌పీ ప్రకటించిన 14 పంటల్లో మొక్కజొన్న, జొన్న, కంది, మినుములు, సోయాబీన్ సహా తొమ్మిది పంటలు సెప్టెంబర్ 4న సగటున ఎంఎస్‌పీకి సమానంగా లేదా అంతకంటే ఎక్కువగానే అమ్ముడైనట్టు వెల్లడైంది.అయితే, సజ్జ (బజ్రా), పెసర పంటలు మాత్రం వరుసగా 31 శాతం, 13 శాతం మేర ఎంఎస్‌పీతో పోలిస్తే నేల చూపులు చూస్తున్నాయి.**

వరి విషయంలో ప్రభుత్వ సేకరణ ప్రభావం చూపుతుండగా ఉత్తరప్రదేశ్‌లో సగటు ధర క్వింటాల్‌కు రూ.1,965గా ఉంది. ఎంఎస్‌పీ కంటే ఇది 20.2 శాతం తక్కువ. ఎల్‌నినో ప్రభావంతో దిగుబడి నష్టాలు నమోదైనప్పటికీ వేరుశనగ, సోయాబీన్ వంటి పంటలు కూడా స్వల్ప నష్టంతోనే నడుస్తున్నాయని గణాంకాలు చెబుతున్నాయి.



**మెరుగ్గా ధరలు**

'వరి ఉత్పత్తిలో 40 శాతం ప్రభుత్వమే కొనుగోలు చేస్తున్నందున దానికి ఢోకా లేదు. పంట సేకరణ మొదలైతే ధరలు మరింత పుంజుకుంటాయి. నూనె దిగుమతులు ఎక్కువగా ఉన్నా సోయాబీన్ ధర గతేడాదితో పోలిస్తే మెరుగ్గానే ఉంది' అని వ్యవసాయ శాఖ మాజీ అదనపు కార్యదర్శి ఒకరు అభిప్రాయపడ్డారు. మొక్కజొన్న ధర ప్రస్తుతం ఎక్కువగా ఉన్నా పశుగ్రాసంతో పోటీ మొదలయ్యాక కిందికి దిగే అవకాశం ఉందని ఆయన చెప్పారు.

**వ్యాపారుల కుమ్మక్కు**

నాఫెడ్ మాజీ అదనపు ఎండీ ఎస్‌కే సింగ్ మాట్లాడుతూ, 'సోయాబీన్ ధర ఆకస్మిక పతనం వెనుక కార్టెలైజేషన్ (వ్యాపారుల కుమ్మక్కు) కనిపిస్తోంది. ఇది ఎక్కువ కాలం కొనసాగదు' అని అన్నారు. మొత్తంగా పెసర తప్ప మిగతా ప్రధాన పంటలన్నీ ఎంఎస్‌పీకి దగ్గరగానే నిలుస్తాయని అభిప్రాయపడ్డారు. ఈ ఏడాది మొక్కజొన్న సాగు విస్తీర్ణం 3 శాతం, వరి విస్తీర్ణం 4 శాతం మేర తగ్గినట్టు సెప్టెంబర్ 4 నాటి అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

## జీవించి ఉండగానే పిల్లలకు ఆస్తి రాస్తున్నారా?

జీవించి ఉండగానే పిల్లలకు ఆస్తులు, పెట్టుబడులు బదిలీ చేయాలనుకునే తల్లిదండ్రుల ముందు సాధారణంగా రెండు మార్గాలుంటాయి.. గిఫ్ట్ డీడ్ ద్వారా వెంటనే బదిలీ చేయడం లేదా విల్లు ద్వారా మరణానంతరం అప్పగించడం. ఈ రెండింటిలో ఏది మెరుగైనదో నిర్ణయించేటప్పుడు ఆస్తిపై నియంత్రణ, ట్యాక్స్-స్టాంప్ డ్యూటీ భారం, వివాదాల అవకాశం, పిల్లలు నివసించే ప్రాంతం వంటి అంశాలు కీలకమని నిపుణులు సూచిస్తున్నారు. ఖైతాన్ అండ్ కో పార్టనర్ బిజల్ అజింక్యా అభిప్రాయం ప్రకారం గిఫ్టులు, విల్లు రెండూ వారసత్వ ప్రణాళికకు సమర్థవంతమైన సాధనాలేనని చెబుతున్నారు. అయితే వ్యక్తి ఉద్దేశం, విల్లు వివాదాస్పదమయ్యే అవకాశం వంటి అంశాల ఆధారంగా సరైన మార్గం ఎంచుకోవాలని పేర్కొన్నారు.

**పన్ను ఉండదు.. కానీ..**

భారత్‌లో నివసించే వ్యక్తులు దగ్గరి బంధువులకు ఇచ్చే గిఫ్టులపై సాధారణంగా ఆదాయపు పన్ను ఉండదు. కానీ స్టాంప్ డ్యూటీ వర్తించవచ్చు. విల్లు ద్వారా వచ్చే ఆస్తులపై పన్ను, స్టాంప్ డ్యూటీ రెండూ ఉండవు. అయితే బదిలీ తర్వాత ఆ ఆస్తుల నుంచి వచ్చే ఆదాయంపై పిల్లలు పన్ను చెల్లించాల్సి ఉంటుంది.


తల్లిదండ్రులకు హక్కు ఉండదు..

స్థిరాస్తి గిఫ్ట్ ఇవ్వాలంటే తప్పనిసరిగా రిజిస్టర్డ్ గిఫ్ట్ డీడ్ అవసరం అవుతుంది. మూవబుల్ ఆస్తులకు ఇది అవసరం లేదు. దగ్గరి బంధువులకు ఇచ్చే నివాస, వ్యవసాయ భూములపై కొన్ని రాష్ట్రాలు రాయితీ స్టాంప్ డ్యూటీ రేట్లు అందిస్తున్నాయి. గిఫ్ట్ ఇచ్చాక పిల్లలు చట్టబద్ధమైన యజమానులవుతారు కాబట్టి, తల్లిదండ్రులు ఆ ఆస్తిపై హక్కు కోల్పోతారు. కానీ విల్లు ద్వారా జీవితకాలం ఆస్తిపై నియంత్రణ కొనసాగించవచ్చు. షరతులతో కూడిన గిఫ్ట్ డీడ్ కూడా ఒక ప్రత్యామ్నాయం.

**పిల్లలు విదేశాల్లో ఉంటే..**

పిల్లలు విదేశాల్లో ఉంటే విదేశీ మారక నియంత్రణ నిబంధనలు, ఆ దేశ పన్ను చట్టాలు కూడా పరిగణించాలి. వివాదాలు, సుదీర్ఘ న్యాయ వ్యాజ్యాల భయంతో ఆస్తుల రక్షణ కోసం ప్రైవేట్ ట్రస్ట్‌లు ఎంపిక చేసుకునే కుటుంబాలు పెరుగుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. అన్ని అంశాలను బేరీజు వేసుకొని, ఆస్తుల వ్యవహారంలో నిపుణుల సలహా మేరకే నిర్ణయం తీసుకోవడం ఉత్తమం.

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక



## 'రంభ ఊర్వశి మేనక' కలెక్షన్స్ జోరు

ఈమధ్య సీరియస్ రోల్స్, ఇంటెన్స్ డ్రామాలు చేస్తూ వచ్చిన అల్లరి నరేష్.. మళ్లీ తన సొంత ట్రాక్ అయిన ఫుల్ లెంగ్త్ ఎంటర్‌టైన్‌మెంట్ వైపు అడుగులేశారు. ఆడియన్స్ కూడా ఆయన నుంచి ఎక్కువగా ఆశించేది వింటేజ్ కామెడీ టైమింగే కావడంతో లేటెస్ట్ మూవీ 'రంభ ఊర్వశి మేనక'పై రిలీజ్ ముందే క్రేజ్ ఏర్పడింది. ఫాంటసీ బ్యాక్‌డ్రాప్‌లో అవుట్ అండ్ అవుట్ కామెడీ ట్రాక్ లో ఈ సినిమా థియేటర్లలోకి వచ్చింది. మొదటి రోజు మార్నింగ్ షోస్ పడగానే కొన్ని చోట్ల మిక్స్‌డ్ టాక్ వినిపించినప్పటికీ, సినిమాలోని ఫన్ ఎలిమెంట్స్ కుర్రాళ్లతో పాటు ఫ్యామిలీస్ కి కనెక్ట్ అవ్వడం మొదలైంది. రొటీన్ కమర్షియల్ మాస్ సినిమాల మధ్య కాసేపు రిలాక్స్ అయి హాయిగా నవ్వుకునే స్పేస్ దొరకడంతో నెమ్మదిగా మౌత్ టాక్ బలపడింది. ముఖ్యంగా శనివారం, ఆదివారం నాటికి బీ, సీ సెంటర్లలో కూడా ఈవెనింగ్ షోలకు ఆక్యుపెన్సీలు మెరుగవుతూ వచ్చాయి. ఈ పాజిటివ్ వర్డ్ ఆఫ్ మౌత్ బాక్సాఫీస్ కలెక్షన్లలో కనిపిస్తోంది. మొదటి మూడు రోజుల్లోనే ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా 4.40 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసి డీసెంట్ వీకెండ్ నంబర్లను నమోదు చేసింది. మిక్స్‌డ్ టాక్ ప్రభావం కొంత ఉన్నప్పటికీ ఈ స్థాయి వసూళ్లు రాబట్టడం మామూలు విషయం కాదు. అల్లరి నరేష్ టైమింగ్‌కి, కామెడీ జానర్‌కు ఇంకా ఆ క్రేజ్ తగ్గలేదని చెప్పవచ్చు. సినిమాలో స్వర్గలోకం నేపథ్యం, రంభ, ఊర్వశి, మేనకలుగా కనిపించిన నటీమణులతో నరేష్ చేసిన కామెడీ ట్రాక్స్ కూడా హైలెట్ అయ్యాయి. లాజిక్కులు వెతక్కుండా కేవలం ఎంటర్‌టైన్‌మెంట్‌ను మాత్రమే ఎంజాయ్ చేసే ఆడియన్స్‌కు ఈ కంటెంట్ బాగా రీచ్ అయింది. చైతన్ భరద్వాజ్ అందించిన మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఆ ఫన్ మూడ్‌ను నిలబెట్టడంలో సాయపడ్డాయి.



## ఇండస్ట్రీకి గుడ్ బై చెప్పేస్తుందా?

లేడీ సూపర్ స్టార్ గా తనకంటూ చెరగని ముద్ర వేసుకున్న కథానాయిక అనుష్క శెట్టి. -అరుంధతి-, -భాగమతి-, -బాహుబలి- వంటి భారీ చిత్రాలతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న స్వీటీ గత కొంతకాలంగా వెండితెరకు.. మీడియా ప్రమోషన్లకు దూరంగా ఉండటం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అమ్మడు నటించిన చిత్రాలు విడుదలవుతున్నా? ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనకపోవడం వెనుక పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తాజా సమాచారం ప్రకారం అనుష్క నటనా జీవితానికి ముగింపు పలకాలనే ఆలోచనలో ఉన్నట్లు పరిశ్రమలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం అనుష్క మలయాళంలో తెరకెక్కుతోన్న భారీ బడ్జెట్ జానపద చిత్రం -కథనార్: ది విల్డ్ సోర్సరర్- లో కీలక పాత్ర పోషిస్తోంది. ఈ ప్రతిష్టాత్మక చిత్రం ఫలితంపైనే అనుష్క భవిష్యత్తు ప్రణాళికలు ఆధారపడి ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. గతంలో క్రమం తప్పకుండా వరుస సినిమాలు చేసిన అనుష్క ఇటీవల కాలంలో కథల ఎంపికలో అత్యంత జాగ్రత్త వహిస్తున్నారు. మనసుకు నచ్చిన, ప్రాధాన్యత ఉన్న పాత్రలకు మాత్రమే ఓకే చెబుతున్నారు. అయితే సినిమాల ఎంపిక తగ్గించడంతో పాటుగా ఆయా చిత్రాల ప్రచార వేదికలపై ఆమె కనిపించకపోవడం అభిమానులను కలవరపెడుతోంది. పర్సనల్ లైఫ్, ఫిట్‌నెస్ లైఫ్‌స్టైల్‌పై దృష్టి పెట్టడం వల్లే ఆమె గ్లామర్ ప్రపంచానికి కాస్త విరామం ఇచ్చారని కొందరు విశ్లేషిస్తున్నారు. -కథనార్- చిత్రం పాన్-ఇండియా స్థాయిలో అత్యంత అట్టహాసంగా విడుదల కానుంది. ఈ సినిమా కనుక బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో విజయాన్ని సాధిస్తే అనుష్క కెరీర్‌ను మరికొంత కాలం కొనసాగించే అవకాశం ఉందంటున్నారు. ఒకవేళ ప్రాజెక్ట్ ఫలితం తారుమారైతే స్వీటీ పూర్తిస్థాయిలో చిత్ర పరిశ్రమకు గుడ్ బై చెప్పి, వ్యక్తిగత జీవితానికే ప్రాధాన్యత ఇవ్వాలని భావిస్తున్నట్లు ప్రచారం మొదలైంది. అనుష్క శెట్టి గ్లామర్ పాత్రలకే పరిమితం కాలేదు. లేడీ ఓరియెంటెడ్ సినిమాలతో బాక్సాఫీస్ వద్ద హీరోలకు సమానంగా వసూళ్లు రాబట్టిన నటి. టాలీవుడ్, కోలీవుడ్‌లలో తిరుగులేని ఇమేజ్‌ను సంపాదించుకున్న అమ్మడు పరిశ్రమను వీడుతున్నారనే వార్తలు అభిమానులను నిరాశకు గురి చేస్తున్నాయి. సోషల్ మీడియా వేదికగా స్వీటీ తిరిగి పూర్తిస్థాయిలో సినిమాలు చేయాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. ఏది ఏమైనా? -కథనార్- చిత్రం విడుదలయ్యే వరకు ఈ ప్రచారాలపై స్పష్టత వచ్చే అవకాశం లేదు. అనుష్క నిర్ణయం ఏదైనా? అమ్మడు మళ్లీ పూర్వ వైభవంతో వెండితెరపై మెరవాలని.. మరిన్ని పవర్‌ఫుల్ పాత్రలతో ప్రేక్షకులను అలరించాలని అభిమానులు మాత్రం బలంగా కోరుకుంటున్నారు.

## 'బేబీ' గుర్తుకు రాకపోతే మేం విజయం సాధించినట్టే: వైష్ణవి చైతన్య



'బేబీ' తర్వాత ఆనంద్, నేను ఛాలెంజింగ్‌గా తీసుకొని 'ఎపిక్' చేశాం. ఈ సినిమా చూస్తున్నప్పుడు 'బేబీ' గుర్తుకురాకపోతే మేము విజయం సాధించినట్టే. ఈ చిత్రం కచ్చితంగా ప్రేక్షకుల ఆదరణ పొందుతుందనే నమ్మకం నాకు మొదటి నుంచి ఉంది' అన్నారు తెలుగు బ్యూటీ వైష్ణవి చైతన్య. బ్లాక్ బస్టర్ 'బేబీ' జోడీ ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న తాజా చిత్రం'ఎపిక్ -- ఫస్ట్ సెమిస్టర్'. '90ం' వెబ్ సిరీస్ తో తెలుగు ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్న యువ దర్శకుడు ఆదిత్య హాసన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించాడు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం సెప్టెంబర్ 11న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో తాజాగా వైష్ణవి మీడియాతో ముచ్చటించారు. ఆ విశేషాలు..మనం ఎన్నో లవ్ స్టోరీలు చూసుంటాం. కానీ, ప్రతి లవ్ స్టోరీలోనూ ఏదోక ప్రత్యేకత ఉంటుంది. ఎపిక్ లో కూడా ఆ ప్రత్యేకత ఉంది. భిన్న దారులు, భిన్న మనస్తత్వాలు ఉన్న ఇద్దరు యూకేకి చదువుకోవడానికి వెళ్లి, అక్కడ కలుస్తారు. లివ్ ఇన్ లో ఉంటారు. ఆ ఇద్దరు ప్రైవేట్ గా మాట్లాడుకునే మాటలు ఏవైతే ఉంటాయో, ఆ సంభాషణల మీద నడిచే సినిమా. అమ్మాయి జీవితాన్ని ఒకలా చూస్తుంది. అబ్బాయి ఒకలా చూస్తాడు. అసలు వీరిద్దరూ ఎలా కలిశారు? వీరిద్దరి ఆలోచనలు ఏంటి? అనేది కొత్తదనాన్ని తీసుకొస్తుంది. ఈ సినిమాలో హంగామా ఉండదు. హత్తుకునేలా ఉంటుంది.


ఇందులో ఆనంద్ పోషించిన ఆదిత్య పాత్ర సాఫ్ట్ గా, కామ్ గా ఉంటుంది. జీవితంలో ఎదురైన అనుభవాల నుంచి ఆదిత్య ఏం నేర్చుకున్నాడనేది ఆసక్తికరంగా ఉంటుంది. నేను పోషించిన కడలి పాత్ర స్ట్రాంగ్ అమ్మాయి. తన కోసం తాను నిలబడే అమ్మాయి. క్లారిటీ ఉన్న అమ్మాయి.కడలి పాత్ర ప్రతి ఒక్కరిలోనూ ఉంటుంది. కానీ, కుటుంబం వల్లనో, సమాజం వల్లనో మనలోని ఆ వెర్షన్ లోపలే ఉండిపోతుంది. బయటకు రాదు. ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఏదోక సమయంలో వారి కోసం వారు నిలబడాలి. అందుకే కడలి పాత్ర నా మనసుకు బాగా దగ్గరైంది.కథలోనూ, నా పాత్రలోనూ కొత్తదనం ఉండాలి. ఆ పాత్రలో నన్ను నేను చూసుకోగలగాలి. ఎపిక్ ఎంచుకోవడానికి కారణమదే.దర్శకుడు ఆదిత్యతో కలిసి పని చేయడం చాలా సరదాగా ఉంటుంది. ఆయన జీవితాన్ని చాలా లోతుగా గమనిస్తుంటారు. జీవితంలో ఉన్న ప్రతి చిన్న విషయాన్ని గమనిస్తూ, అందులో ఉన్న ప్రాముఖ్యత గురించి మాట్లాడుతుంటారు. ఎపిక్ సినిమాలో కూడా అదే కనిపిస్తుంది. ఆదిత్య, కడలి పాత్రల మధ్య జరిగే చిన్న విషయాలకు ఎంత ఇంపార్టెన్స్ ఉందో చూపిస్తారు.




## థియేటర్లను షేక్ చేసిన సినిమా..

హిందీ చిత్రపరిశ్రమలో సరికొత్త సంచలనం సృష్టించిన సినిమా ఫర్హాన్ అక్తర్ తెరకెక్కించిన దిల్ చాహతా హై. ఈ కల్ట్ క్లాసికల్ సినిమా విడుదలై 25 సంవత్సరాలు పూర్తైనప్పటికీ ఈ మూవీ పట్ల సినీ ప్రియుల క్రేజ్ మాత్రం తగ్గలేదు. ఇందులో ఆమిర్ ఖాన్, సైఫ్ అలీ ఖాన్, అక్షయ్ ఖన్నా, ప్రీతి జింటా, సోనాలి కులకర్ణి , డింపుల్ కపాడియా ముఖ్య పాత్రలు పోషించారు. స్నేహం , ప్రేమ గురించి కొత్త పాఠాలను నేర్పుతూ, యువతరానికి ఎప్పటికీ ఇష్టమైన చిత్రంగా కొనసాగుతోంది. పావు శతాబ్దం క్రితం విడుదలైన కల్ట్ క్లాసిక్ 'దిల్ చాహతా హై' కథ, పాటలు ప్రేక్షకులను ఆకట్టుకున్నప్పటికీ, అక్షయ్ ఖన్నా సరసన కథానాయికగా నటించడానికి డింపుల్ కపాడియా మొదట్లో సంకోచించారు. ఆమె గతంలో అక్షయ్ ఖన్నా తండ్రి వినోద్ ఖన్నా సరసన కథానాయికగా నటించినందున, తనకంటే 18 ఏళ్లు చిన్నవాడైన నటుడితో రొమాంటిక్ సన్నివేశాల్లో నటించడం సముచితమూ కాదన్నా సందేహమే ఈ సంకోచానికి కారణం. స్క్రిప్ట్ చదవగానే 'దిల్ చాహతా హై'లోని పాత్రను తాను తిరస్కరించినట్లు డింపుల్ కపాడియా ఒక ఇంటర్వ్యూలో వెల్లడించారు. తనకంటే 18 ఏళ్లు చిన్నవాడైన కథానాయకుడితో రొమాంటిక్ సన్నివేశాల్లో నటించడానికి ఆమె మొదట్లో సంకోచించారు. తెరపై ఇంత వయసు వ్యత్యాసంతో ఉన్న జంటను ప్రేక్షకులు ఎలా అంగీకరిస్తారోనన్న ఆందోళనే ఆమె అయిష్టతకు కారణమని వెల్లడించారు. ఈ క్లాసిక్ చిత్రం ఈ ఏడాది ఆగస్టులో విడుదలై 25 ఏళ్లు పూర్తి చేసుకుంది.తాను మొదట ఈ సినిమా ఆఫర్‌ను తిరస్కరించినట్లు నటి డింపుల్ కపాడియా వెల్లడించారు. తనకంటే చాలా చిన్నవాడైన హీరోతో ప్రేమలో పడే తార పాత్రను పోషించడానికి ఆమె మొదట సంకోచించారు.

## 'ది ప్యారడైజ్' విడుదల వాయిదా?



నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా నటిస్తున్న యాక్షన్ డ్రామా 'ది ప్యారడైజ్' విడుదల తేదీపై మళ్లీ నీలినీడలు కమ్ముకున్నాయి. ముందుగా ప్రకటించిన ప్రకారం సెప్టెంబర్ 24న ఈ చిత్రాన్ని విడుదల చేయాల్సి ఉండగా, కొన్ని కారణాల వల్ల వాయిదా పడే అవకాశం ఉందని టాలీవుడ్‌లో జోరుగా ప్రచారం జరుగుతోంది. పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో జాప్యం కారణంగా సినిమాను అక్టోబర్ 1వ తేదీకి మార్చాలని చిత్రబృందం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఫిల్మ్ నగర్ వర్గాల సమాచారం ప్రకారం, 'ది ప్యారడైజ్' క్లైమాక్స్‌లో భారీ స్థాయిలో వీఎఫ్ఎక్స్, సీజీ వర్క్ ఉంది. ఈ గ్రాఫిక్స్ పనులు అనుకున్న సమయానికి పూర్తి కావడం లేదని, అందుకే విడుదల తేదీని వాయిదా వేయాలనే ఆలోచనలో ఉన్నారని అంటున్నారు. నిర్మాత సుధాకర్ చెరుకూరి ఒక్క క్లైమాక్స్ సీజీ వర్క్ కోసమే సుమారు రూ.2 కోట్లు ఖర్చు చేస్తున్నారని, నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీ పడకూడదనే ఉద్దేశంతోనే ఈ జాప్యం జరుగుతోందని సమాచారం. ఒకవేళ ఈ సినిమా అక్టోబర్ 1కి వాయిదా పడితే, బాక్సాఫీస్ వద్ద ఆసక్తికర పోటీ నెలకొననుంది. నాగవంశీ నిర్మించిన 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం. 47' అక్టోబర్ 2న విడుదల కానుంది. విశేషమేమిటంటే, 'ది ప్యారడైజ్' నైజాం హక్కుల్లో నాగ వంశీకి 25 శాతం వాటా ఉంది. గతంలో 'ది ప్యారడైజ్' కోసం ఆయన తన సినిమాను వాయిదా వేసుకున్నారు. ఇప్పుడు ఈ రెండు చిత్రాలు దాదాపు ఒకేసారి విడుదలయ్యే పరిస్థితి ఏర్పడుతోంది.

EDITED , PRINTED, PUBLISHED & OWNED BY PRINTED AND PUBLISHED BY MAHESH ETABONIA ON BEHALF OF NETI PRASTAVANAM MEDIA NETWORK , HNO-14-249/1/37 SAI NAGAR COLONY,MEDCHAL(V) MEDCHAL MALIKAJGIRI, -501401 at 14-249/1/37 Sai Nagar Colony, MEDCHAl, TELANGANA STATE , EDITOR : MAHESH ETABONIA :9908086026 Website : https://netiprasthanam.in/